www.aashwi.net / in
PRGI NO. TGMUL/26/A2874

# ఆశ్వి అప్డేట్స్

AASHWI UPDATES ENGLISH I TELUGU I HINDI DAILY

మంగళవారం, 16-06-2026 | రంగారెడ్డి Rangareddy | సంపుటి : 01 Volume : 01 | సంచిక :47 Issue : 47 | పేజీలు :08 pages :08 | వెల : రూ.02 price : ₹.02 | www.aashwi.net/in

## బ్రిడ్జి పోరాటం




5

### సింగరేణి కార్మికులకు

# అన్యాయం

తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కల్వకుంట్ల కవిత
వారసత్వ ఉద్యోగాల విషయంలో కార్మికులకు
నష్టం జరుగుతోందని ఆరోపణ
మంచిర్యాల జిల్లా కాసిపేట
గనిపై 'బొగ్గుబాయి' బాట కార్యక్రమం
గేట్ మీటింగ్‌లో ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు
సింగరేణి పరిరక్షణ కోసం
టీఆర్ఎస్, హెచ్ఎంఎస్ కలిసి పోరాటం
పాలసీలు రూపొందించాల్సిన ప్రభుత్వమే
బాధ్యత నుంచి తప్పుకుంటోందని వ్యాఖ్య
సీఎం, డిప్యూటీ సీఎం అధికారులకు
వినతులు ఇవ్వడం విచిత్రమని విమర్శ
కార్మిక రంగాన్ని మభ్యపెట్టే ప్రయత్నాలు
జరుగుతున్నాయని ఆరోపణ
సింగరేణి ప్రైవేటీకరణకు కుట్రలు
జరుగుతున్నాయని ఆందోళన
అండర్ గ్రౌండ్ గనుల
భవిష్యత్‌పై ఆందోళన వ్యక్తం




ఆశ్వి అప్డేట్స్, హైదరాబాద్

వారసత్వ ఉద్యోగాల అంశంలో సింగరేణి కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేస్తోందని తెలంగాణ రక్షణసేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. మంచిర్యాల జిల్లా మందమర్రి ప్రాంతంలోని కాసిపేట గనిపై నిర్వహించిన 'బొగ్గుబాయి' బాట కార్యక్రమంలో భాగంగా జరిగిన గేట్ మీటింగ్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు.
సింగరేణి కార్మికుల సమస్యలు రోజురోజుకూ పెరుగుతున్నప్పటికీ ప్రభుత్వం వాటి పరిష్కారంపై సరైన దృష్టి సారించడం లేదని కవిత ఆరోపించారు. ముఖ్యంగా వారసత్వ ఉద్యోగాల విషయంలో కార్మిక కుటుంబాలకు న్యాయం జరగాల్సి ఉండగా, ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందన్నారు.
సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధన కోసం తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్)తో పాటు హింద్ మజ్దూర్ సభ (హెచ్ఎంఎస్) కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. సంస్థ భవిష్యత్తును మిగతా 2లో..

### మెట్రో విస్తరణకు కేంద్రం అడ్డంకులు

# సృష్టిస్తోంది

హైదరాబాద్ మెట్రో అభివృద్ధిలో గత ప్రభుత్వ
వైఫల్యాలపై సీఎం విమర్శలు
తొలి దశ వ్యయం రూ.15 వేల కోట్ల నుంచి
రూ.22 వేల కోట్లకు పెరిగిందని వెల్లడి
ప్రజల అవసరాలున్న ప్రాంతాలకు మెట్రో
విస్తరణ జరగలేదని వ్యాఖ్య
మెట్రో ఫేజ్ 2 అనుమతుల కోసం
కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చామని స్పష్టం
ఆర్థిక ఇబ్బందులతో విస్తరణకు ఎల్అండ్‌టీ ముందుకు రావట్లేదని వివరణ
ఐఆర్ఎఫ్‌సీ రుణాల విషయంలో
కేంద్రం సహకరించలేదని ఆరోపణ
కిషన్‌రెడ్డి కారణంగానే రుణ మంజూరు
ప్రక్రియ నిలిచిపోయిందని విమర్శ
అహ్మదాబాద్, విశాఖకు అనుమతులు..
హైదరాబాద్‌కు నిరాకరణ అంటూ ఆక్షేపణ
తెలంగాణపై కేంద్రం వివక్ష
కొనసాగిస్తోందని ఆరోపించిన సీఎం
కేంద్ర హామీల అమలుపై ప్రధాని
మోదీని ప్రశ్నించిన రేవంత్ రెడ్డి



ఆశ్వి అప్డేట్స్, హైదరాబాద్

హైదరాబాద్ నగర రవాణా వ్యవస్థలో కీలకమైన మెట్రో రైలు ప్రాజెక్టు విస్తరణకు కేంద్ర ప్రభుత్వం నుంచి తగిన సహకారం లభించడం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశంలోని ఇతర ప్రధాన నగరాలతో పోలిస్తే మెట్రో రైలు విస్తరణలో హైదరాబాద్ వెనుకబడిందన్నారు.
హైదరాబాద్ మెట్రో తొలి దశ నిర్మాణం ప్రారంభంలో రూ.15 వేల కోట్ల వ్యయంతో పూర్తికావాల్సి ఉండగా, అనంతరం ఆ వ్యయం రూ.22 వేల కోట్లకు పెరిగిందని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రజలు ఎక్కువగా ప్రయాణించే ప్రాంతాలకు మెట్రో సేవలను విస్తరించడంలో విఫలమయ్యారని విమర్శించారు.
మెట్రో రెండో దశ (ఫేజ్ 2) విస్తరణకు కేంద్ర ప్రభుత్వ అనుమతులు పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం ప్రయత్నాలు చేస్తోందని రేవంత్ రెడ్డి చెప్పారు. అయితే, ప్రస్తుతం మెట్రో ప్రాజెక్టును నిర్వహిస్తున్న ఎల్అండ్‌టీ సంస్థ ప్రతి ఏడాది సుమారు రూ.400 కోట్ల మేర నష్టాలను మిగతా 2లో..

### అమెరికా-ఇరాన్ శాంతి ఒప్పందాన్ని

# స్వాగతించిన మోదీ

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు
ముగింపు పలకడంపై ప్రధాని హర్షం
అమెరికా, ఇరాన్ అంగీకారాన్ని స్వాగతించిన భారత్
శాంతి, స్థిరత్వాల పునరుద్ధరణకు
ఇది కీలక పరిణామమన్న మోదీ
స్వేచ్ఛా నౌకాయానం, వాణిజ్యానికి
ఒప్పందం దోహదపడుతుందని ఆశాభావం
మిగిలిన అంశాలపైనా
సానుకూల చర్చలు కొనసాగాలని ఆకాంక్ష
యుద్ధ ప్రభావంతో ప్రపంచ ఆర్థిక
వ్యవస్థలు దెబ్బతిన్నాయని వ్యాఖ్య
అనేక దేశాల్లో ప్రాణనష్టం సంభవించిందని ఆవేదన
ట్రంప్ ప్రకటనను ధ్రువీకరించిన టెహ్రాన్
జూన్ 19న స్విట్జర్లాండ్‌లో అధికారిక ఒప్పందంపై సంతకాలు
హర్మూజ్ జలసంధి, చమురు ఆంక్షలపై
ఏకాభిప్రాయం కుదిరినట్లు సమాచారం



ఆశ్వి అప్డేట్స్, న్యూఢిల్లీ

అమెరికాఇరాన్ మధ్య కుదిరిన శాంతి ఒప్పందాన్ని ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలకు ముగింపు పలికే దిశగా ఇరు దేశాలు ఒక అంగీకారానికి రావడం సానుకూల పరిణామమని పేర్కొన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్‌లో ప్రధాని తన అభిప్రాయాన్ని వెల్లడించారు. పశ్చిమాసియాలో కొనసాగిన ఘర్షణల ప్రభావం ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల ఆర్థిక వ్యవస్థలపై తీవ్రంగా పడిందని మోదీ పేర్కొన్నారు. యుద్ధ పరిస్థితుల కారణంగా ప్రాణనష్టం సంభవించడంతో పాటు వాణిజ్య కార్యకలాపాలు కూడా మిగతా 2లో..

## నావికుల మృతిపై కేంద్రం మౌనం దారుణం

ఒమన్ తీరంలో భారత నావికుల మృతిపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం
అమెరికా వైఖరిని తీవ్రంగా తప్పుబట్టిన రాహుల్ గాంధీ
క్షమాపణ చెప్పకుండానే హెచ్చరికలు జారీ చేయడం సరికాదని వ్యాఖ్య
సార్వభౌమ దేశం ఇలాంటి భాషను సహించదన్న కాంగ్రెస్ ఎంపీ
అమెరికా ఆదేశాలను కేంద్రం పాటిస్తోందని విమర్శ
భారత గౌరవాన్ని కాపాడడంలో మోదీ విఫలమయ్యారని ఆరోపణ
ముగ్గురు నావికుల మృతిపై ప్రధాని స్పందించలేదని ఖర్గే విమర్శ
మూడు రోజులైనా సంతాప ప్రకటన చేయలేదని ఆక్షేపణ
జాతీయ ప్రయోజనాలను కేంద్రం తాకట్టు పెడుతోందని ఆరోపణ
'విశ్వగురు' ప్రచారంతో వాస్తవాలను కప్పిపుచ్చుతున్నారని వ్యాఖ్య



ఆశ్వి అప్డేట్స్, న్యూఢిల్లీ

ఒమన్ తీరంలో భారత నావికుల మృతిపై కేంద్ర ప్రభుత్వం స్పందించిన తీరును కాంగ్రెస్ అగ్రనేతలు తీవ్రంగా తప్పుబట్టారు. ఈ ఘటనపై అమెరికా క్షమాపణలు చెప్పకపోగా, భారత్‌ను ఉద్దేశించి హెచ్చరికలు జారీ చేయడం మిగతా 2లో..

## ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ అభాండాలు నిరాధారం ఆరోపణలు చేస్తోంది

బీజేపీ స్టేట్ చీఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు
ప్రధాన ఎన్నికల కమిషనర్ వ్యవహారంపై కాంగ్రెస్
విమర్శలను ఖండించిన భాజపా రాష్ట్ర అధ్యక్షుడు
గతంలో సీఈసీలకు పద్మ పురస్కారాలు,
రాజ్యసభ పదవులు ఇచ్చింది కాంగ్రెసేనని వ్యాఖ్య
ఎస్ఐఆర్ ప్రక్రియ కొత్తది కాదని స్పష్టీకరణ
గతంలోనే 12 సార్లు ఈ ప్రక్రియ
అమలైందని వెల్లడింపు
ప్రతి రాజకీయ పార్టీకి బీఎల్ఏ2 నియామక
అవకాశం ఉంటుందని వివరణ
అభ్యంతరాలు ఉంటే సంబంధిత ప్రతినిధులు
వెంటనే తెలియజేయవచ్చని సూచన
దొంగ ఓట్లు, డూప్లికేట్
ఓట్ల తొలగింపే ఎస్ఐఆర్ లక్ష్యమని స్పష్టం
ఎన్నికల ప్రక్రియను రాజకీయ రంగు పులమొద్దని హితవు
ఎస్ఐఆర్‌కు భాజపా లేదా
కేంద్ర ప్రభుత్వంతో సంబంధం లేదని వ్యాఖ్య
ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో అపోహలు
సృష్టించడం సరికాదని సూచన



ఆశ్వి అప్డేట్స్, హైదరాబాద్

కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలు వాస్తవాలకు విరుద్ధమని తెలంగాణ భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. ఎన్నికల కమిషన్‌పై రాజకీయ విమర్శలు మిగతా 2లో..

## స్కూల్ బస్సులపై ఆర్టీఏ కొరడా

రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల వాహనాల తనిఖీలు
వెయ్యికిపైగా స్కూల్ బస్సుల పరిశీలన
నిబంధనలు ఉల్లంఘించిన బస్సులపై కేసులు
150కుపైగా వాహనాలపై చర్యలు
ఫిట్‌నెస్ లేని బస్సులపై కఠిన నిర్ణయం
35 విద్యాసంస్థల వాహనాల సీజ్
విద్యార్థుల భద్రతే ప్రధాన లక్ష్యమన్న అధికారులు
రవాణా నిబంధనల అమలుపై ప్రత్యేక దృష్టి
యాజమాన్యాలకు హెచ్చరికలు జారీ
తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని స్పష్టం



ఆశ్వి అప్డేట్స్, హైదరాబాద్

తెలంగాణలో కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమై పాఠశాలలు తెరుచుకున్న నేపథ్యంలో విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ రవాణాశాఖ అధికారులు రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బస్సులపై విస్తృత తనిఖీలు నిర్వహించారు. పాఠశాలలకు విద్యార్థులను తరలిస్తున్న వాహనాలు నిబంధనల ప్రకారం నడుస్తున్నాయా లేదా అన్న అంశంపై ప్రత్యేక దృష్టి సారించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఇవాళ వెయ్యికిపైగా స్కూల్ బస్సులను ఆర్టీఏ అధికారులు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, బీమా, పర్మిట్లు, అత్యవసర భద్రతా పరికరాలు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, అగ్నిమాపక పరికరాలు, డ్రైవర్ల అర్హతలు, వాహనాల మిగతా 2లో..

## కేంద్రం పంటలు ఎందుకు కొనడం లేదు?

### వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రశ్న

మొక్కజొన్న కొనుగోళ్లపై
అధికారులతో మంత్రి సమీక్ష
కనీస మద్దతు ధరపై కేంద్ర
ప్రభుత్వాన్ని ప్రశ్నించిన తుమ్మల
రైతులకు ఇచ్చిన హామీలను
అమలు చేయాలని డిమాండ్
గిట్టుబాటు ధర వస్తుందనే ఆశతో
రైతులు సాగు చేశారన్న మంత్రి
కొనుగోళ్లు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన
సేకరించిన పంటలను వెంటనే
కొనుగోలు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి
మార్కెట్‌లో ధరలు
పడిపోవడంతో రైతుల్లో ఆందోళన
వ్యవసాయ ఉత్పత్తులకు ధరల భరోసా
కల్పించాల్సిన అవసరమని సూచన
రైతుల శ్రమకు తగిన
ప్రతిఫలం అందడం లేదని వ్యాఖ్య
రైతు ప్రయోజనాల విషయంలో
కేంద్రం స్పందించాలని డిమాండ్



ఆశ్వి అప్డేట్స్, హైదరాబాద్

కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కల్పిస్తామని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం, రైతులు పండించిన పంటలను ఎందుకు కొనుగోలు చేయడం లేదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రశ్నించారు. గిట్టుబాటు ధర లభిస్తుందనే నమ్మకంతో రైతులు సాగు చేసినప్పటికీ, ప్రస్తుతం వారికి న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని టీజీ మార్క్‌ఫెడ్ కార్యాలయంలో మొక్కజొన్న కొనుగోళ్ల అంశంపై ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష సమావేశం మిగతా 2లో..

## అమెరికాఇరాన్ శాంతి ఒప్పందాన్ని

# స్వాగతించిన మోదీ

**మొదటిపేజీ తరువాయి**

దెబ్బతిన్నాయని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అమెరికా, ఇరాన్ శాంతి దిశగా ముందడుగు వేయడం స్వాగతించదగ్గ విషయమని అభిప్రాయపడ్డారు.

ఈ ఒప్పందం ద్వారా పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వాలను పునరుద్ధరించే అవకాశాలు మెరుగుపడతాయని భారత్ విశ్వసిస్తోందని ప్రధాని తెలిపారు. అంతర్జాతీయ సముద్ర మార్గాల్లో స్వేచ్ఛా నౌకాయానానికి, ప్రపంచ వాణిజ్యానికి భరోసా కల్పించడంలో ఈ పరిణామం కీలకంగా మారుతుందని పేర్కొన్నారు.

అంతేకాకుండా, ప్రస్తుతం కుదిరిన అంగీకారం శాశ్వత పరిష్కారానికి తొలి అడుగుగా నిలవాలని మోదీ ఆకాంక్షించారు. మిగిలిన కీలక అంశాలపైనా ఇరు దేశాలు సానుకూల చర్చలు జరిపి సుస్థిరమైన తుది ఒప్పందానికి చేరుకుంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలికేలా ఇరాన్‌తో ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించారు. ఈ ప్రకటనను ఇరాన్ రాజధాని టెహ్రాన్ కూడా ధ్రువీకరించింది.

ఇరుదేశాల మధ్య కుదిరిన ఈ అవగాహన ఒప్పందంపై స్విట్జర్లాండ్ వేదికగా జూన్ 19న అధికారిక సంతకాలు జరగనున్నట్లు సమాచారం. హర్మూజ్ జలసంధిలో అమెరికా నౌకాదళ దిగ్బంధాన్ని తొలగించడం, ఆ సముద్ర మార్గాన్ని పూర్తిస్థాయిలో తెరవడం, ఇరాన్ చమురుపై అమలులో ఉన్న కొన్ని ఆంక్షల విషయంలో సడలింపులు వంటి అంశాలపై ఇరు దేశాలు ఏకాభిప్రాయానికి వచ్చినట్లు అంతర్జాతీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

ప్రపంచ ఇంధన సరఫరా, అంతర్జాతీయ వాణిజ్యం, ప్రాంతీయ భద్రత పరంగా ఈ ఒప్పందం కీలక మలుపుగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. పశ్చిమాసియాలో శాంతి నెలకొంటే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలకు కూడా ఊరట లభించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# నావికుల మృతిపై కేంద్రం మౌనం దారుణం

**మొదటిపేజీ తరువాయి**

ఆందోళనకరమని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు.

ఈ మేరకు ఎక్స్ వేదికగా స్పందించిన రాహుల్ గాంధీ, ముగ్గురు భారతీయుల మృతిపై కనీసం సంతాపం కూడా వ్యక్తం చేయని అమెరికా, తన సైనిక ఆదేశాలను వెంటనే అమలు చేయాలని భారత్‌కు సూచించడం సమంజసం కాదన్నారు. ప్రపంచంలో ఏ సార్వభౌమ దేశమైనా ఇలాంటి వ్యాఖ్యలను సహించదని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా వైఖరిపై గట్టిగా స్పందించాల్సిన సమయంలో మౌనంగా ఉన్నారని రాహుల్ విమర్శించారు. రాజీ పడే నాయకత్వం దేశ గౌరవాన్ని కాపాడలేదని, ప్రస్తుత పరిస్థితుల్లో భారతీయుడిగా ఉండటం దురదృష్టకరంగా మారిందని ఆయన వ్యాఖ్యానించారు.

ఈ అంశంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా కేంద్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. భారతీయ నావికులు మరణించి మూడు రోజులు గడిచినా, వారి మృతిపై ప్రధాని మోదీ నుంచి కనీస సంతాప సందేశం లేదా బహిరంగ ప్రకటన రాకపోవడం బాధాకరమన్నారు. దేశ ప్రతిష్ఠ, సార్వభౌమాధికారాన్ని కేంద్ర ప్రభుత్వం ఎంతగా దిగజార్చిందో చెప్పేందుకు ఇప్పుడు ప్రత్యేక ఉదాహరణలు అవసరం లేదని ఖర్గే పేర్కొన్నారు. జాతీయ ప్రయోజనాలను కేంద్ర ప్రభుత్వం రోజువారీగా తాకట్టు పెడుతోందని ఆరోపించారు. 'విశ్వగురు' అనే ప్రచారంతో వాస్తవ పరిస్థితులను కప్పిపుచ్చే ప్రయత్నం జరుగుతోందని ఖర్గే విమర్శించారు. విదేశాంగ విధానంలో దేశ గౌరవం, భద్రత, భారతీయుల ప్రాణాలకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని సూచించారు. ఒమన్ తీర ఘటనపై కేంద్ర ప్రభుత్వం పూర్తి వివరాలను వెల్లడించడంతో పాటు, మృతుల కుటుంబాలకు అండగా నిలవాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. అలాగే ఈ ఘటనకు సంబంధించిన అంశాలపై అమెరికా ప్రభుత్వంతో స్పష్టమైన చర్చలు జరపాలని కోరారు.

# స్కూల్ బస్సులపై ఆర్టీఏ కొరడా

**మొదటిపేజీ తరువాయి**

సాంకేతిక స్థితి వంటి అంశాలను పరిశీలించారు. తనిఖీల సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న 150కుపైగా స్కూల్ బస్సులను గుర్తించిన అధికారులు వాటిపై కేసులు నమోదు చేశారు. కొన్ని వాహనాల్లో అవసరమైన భద్రతా ప్రమాణాలు లేకపోవడం, మరికొన్నింటిలో పత్రాలు సక్రమంగా లేకపోవడం వంటి ఉల్లంఘనలు బయటపడ్డాయి.

అదేవిధంగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా విద్యార్థులను తరలిస్తున్న 35 విద్యాసంస్థల వాహనాలను అధికారులు సీజ్ చేశారు. విద్యార్థుల ప్రాణాలకు ప్రమాదకరంగా మారే పరిస్థితులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు.

విద్యాసంస్థల యాజమాన్యాలు రవాణా నిబంధనలను కచ్చితంగా పాటించాలని అధికారులు సూచించారు. విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే మరింత కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా స్కూల్ బస్సుల తనిఖీలు రానున్న రోజుల్లో కూడా కొనసాగుతాయని రవాణాశాఖ అధికారులు వెల్లడించారు.

## ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ అభాండాలు

# నిరాధారం ఆరోపణలు చేస్తోంది

**మొదటిపేజీ తరువాయి**

చేయడం ద్వారా ప్రజల్లో అనవసర అనుమానాలు రేకెత్తించే ప్రయత్నం జరుగుతోందని ఆయన విమర్శించారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన రామచందర్‌రావు, ఎన్నికల వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతున్న కాంగ్రెస్ పార్టీ తన గత చరిత్రను ఒకసారి గుర్తు చేసుకోవాలని సూచించారు. గతంలో ప్రధాన ఎన్నికల కమిషనర్లకు పద్మ పురస్కారాలు ఇవ్వడం, రాజ్యసభ సభ్యత్వాలు కల్పించడం వంటి నిర్ణయాలను కాంగ్రెస్ ప్రభుత్వాలే తీసుకున్నాయని గుర్తు చేశారు.

ఓటర్ల జాబితా ప్రత్యేక సమీక్ష (ఎస్ఐఆర్) ప్రక్రియపై వస్తున్న విమర్శలను కూడా ఆయన ఖండించారు. ఈ ప్రక్రియ కొత్తగా ప్రారంభించినది కాదని, గతంలో ఇప్పటికే 12 సార్లు అమలైందని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, ఖచ్చితత్వం కోసం ఎన్నికల కమిషన్ నిర్దిష్ట వ్యవధుల్లో ఇలాంటి చర్యలు చేపడుతుందని చెప్పారు.

ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి రాజకీయ పార్టీకి బూత్ స్థాయి ఏజెంట్లను (బీఎల్ఏ2) నియమించుకునే అవకాశం ఉంటుందని రామచందర్‌రావు వివరించారు. ఓటర్ల జాబితాలో ఏవైనా తప్పులు, అభ్యంతరాలు లేదా అనుమానాస్పద అంశాలు ఉంటే ఆయా పార్టీల ప్రతినిధులు వెంటనే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చన్నారు.

ఈ ప్రక్రియలో లక్ష్యం కేవలం దొంగ ఓట్లు, డూప్లికేట్ ఓట్లు, అర్హత లేని పేర్లను గుర్తించి తొలగించడం మాత్రమేనని స్పష్టం చేశారు. చట్టబద్ధమైన ఓటర్ల హక్కులకు ఎలాంటి భంగం కలగకుండా ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.ఎస్ఐఆర్ ప్రక్రియను రాజకీయ కోణంలో చూడడం సరికాదని రామచందర్‌రావు అన్నారు. ఎన్నికల కమిషన్ స్వతంత్ర రాజ్యాంగబద్ధ సంస్థగా పనిచేస్తోందని, దాని చర్యలను రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించడం తగదని వ్యాఖ్యానించారు.ప్రత్యేక ఓటరు జాబితా సమీక్షకు భారతీయ జనతా పార్టీ లేదా కేంద్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. ఇది పూర్తిగా ఎన్నికల కమిషన్ పరిధిలో జరిగే పరిపాలనా ప్రక్రియ అని తెలిపారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో అపోహలు, అనుమానాలు సృష్టించే బదులు రాజకీయ పార్టీలు నిర్మాణాత్మక సూచనలు చేయాలని రామచందర్‌రావు సూచించారు. పారదర్శక ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

# మెట్రో విస్తరణకు కేంద్రం అడ్డంకులు సృష్టిస్తోంది

**మొదటిపేజీ తరువాయి**



ఎదుర్కొంటోందని, ఆర్థిక పరిస్థితుల కారణంగా కొత్త విస్తరణ పనులపై ముందుకు రావడానికి ఆసక్తి చూపడం లేదని వివరించారు.

ఎల్అండ్‌టీకి ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందని సీఎం తెలిపారు. సంస్థకు ఉన్న భారీ రుణభారాన్ని తగ్గించే దిశగా ఐఆర్ఎఫ్‌సీ ద్వారా రూ.13,600 కోట్ల రుణ సదుపాయం కల్పించే ప్రయత్నాలు చేశామని చెప్పారు. తక్కువ వడ్డీ రేటుతో రుణం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేసినప్పటికీ, ఆ ప్రక్రియ పూర్తికాలేదన్నారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డిపై రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. తెలంగాణ అభివృద్ధికి తోడ్పడాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, మెట్రో విస్తరణకు అవసరమైన ఆర్థిక సహకారం అందకుండా అడ్డంకులు సృష్టించారని ఆరోపించారు. ఐఆర్ఎఫ్‌సీ రుణ మంజూరు ప్రక్రియ నిలిచిపోవడానికి ఆయన జోక్యమే కారణమని పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వ వైఖరిపై అసంతృప్తి వ్యక్తం చేసిన సీఎం, అహ్మదాబాద్, విశాఖపట్నం వంటి నగరాల మెట్రో ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేస్తూ హైదరాబాద్ మెట్రో ఫేజ్2 విషయంలో మాత్రం ఆలస్యం చేయడం వివక్షకు నిదర్శనమని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కేంద్రం సమాన దృష్టితో వ్యవహరించడం లేదని విమర్శించారు.

హైదరాబాద్ నగర అభివృద్ధికి అత్యంత కీలకమైన రీజినల్ రింగ్ రోడ్ (ట్రిపుల్ ఆర్) ప్రాజెక్టును కూడా కేంద్రం 2023లో ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు అమలులోకి తీసుకురాలేదని గుర్తుచేశారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు అంశాల్లో కేంద్రం ప్రకటించిన హామీలు కార్యరూపం దాల్చలేదని వ్యాఖ్యానించారు.

ప్రధాని నరేంద్ర మోదీ గతంలో చేసిన పలు హామీలను ప్రస్తావిస్తూ రేవంత్ రెడ్డి విమర్శలు చేశారు. ప్రతి సంవత్సరం కోట్లాది ఉద్యోగాలు కల్పిస్తామని, ప్రజల బ్యాంకు ఖాతాల్లో భారీ మొత్తాలు జమ చేస్తామని చేసిన వాగ్దానాలు అమలు కాలేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తన హామీలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

మెట్రో ఫేజ్2 ప్రాజెక్టు ఆమోదం, నగర మౌలిక వసతుల అభివృద్ధి, కేంద్రరాష్ట్ర సంబంధాలు తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం తన పోరాటాన్ని కొనసాగిస్తుందని సీఎం స్పష్టం చేశారు. హైదరాబాద్ భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని మెట్రో విస్తరణ అత్యవసరమని, ఈ విషయంలో కేంద్రం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు.

# సింగరేణి కార్మికులకు అన్యాయం

**మొదటిపేజీ తరువాయి**

వాటి పరిష్కారంపై సరైన దృష్టి సారించడం లేదని కవిత ఆరోపించారు. ముఖ్యంగా వారసత్వ ఉద్యోగాల విషయంలో కార్మిక కుటుంబాలకు న్యాయం జరగాల్సి ఉండగా, ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందన్నారు.

సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధన కోసం తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్)తో పాటు హింద్ మజ్దూర్ సభ (హెచ్ఎంఎస్) కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. సంస్థ భవిష్యత్తును కాపాడేందుకు కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

పాలసీలు రూపొందించి అమలు చేయాల్సిన ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులే అధికారులకు వినతిపత్రాలు ఇవ్వడం ఆశ్చర్యకరమని కవిత వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్నవారే సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాల్సి ఉండగా, బాధ్యతలను ఇతరులపై నెట్టివేస్తూ కార్మికులను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

సింగరేణి సంస్థను క్రమంగా ప్రైవేటీకరణ దిశగా నడిపించే కుట్రలు జరుగుతున్నాయని ఆమె ఆరోపించారు. ప్రభుత్వ విధానాలు కొనసాగితే సంస్థ భవిష్యత్తు ప్రమాదంలో పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికుల ప్రయోజనాల కంటే ప్రైవేటు సంస్థలకు లాభం చేకూర్చే నిర్ణయాలు తీసుకుంటున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు.

ప్రత్యేకించి అండర్ గ్రౌండ్ గనుల పరిరక్షణ అత్యంత అవసరమని కవిత అన్నారు. భూగర్భ గనులు సింగరేణి చరిత్రలో కీలక భాగమని, వాటి కొనసాగింపుకు ప్రభుత్వం స్పష్టమైన విధానం ప్రకటించాలని డిమాండ్ చేశారు. గనుల మూసివేత లేదా కార్యకలాపాల తగ్గింపు



వల్ల వేలాది మంది కార్మికుల జీవనోపాధి దెబ్బతింటుందని హెచ్చరించారు.

అండర్ గ్రౌండ్ మైన్లను కాపాడుకోవడం కోసం హింద్ మజ్దూర్ సభతో కలిసి ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఆమె స్పష్టం చేశారు. కార్మికుల హక్కులు, సింగరేణి సంస్థ భవిష్యత్తు, వారసత్వ ఉద్యోగాల పరిరక్షణ కోసం అవసరమైతే మరింత ఉధృతంగా పోరాటాలు చేపడతామని హెచ్చరించారు. సింగరేణి కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, సంస్థ పరిరక్షణకు స్పష్టమైన హామీ ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, సంస్థ అభివృద్ధి అంశాల్లో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

# కేంద్రం పంటలు ఎందుకు కొనడం లేదు?

**మొదటిపేజీ తరువాయి**

నిర్వహించారు. రాష్ట్రంలో మొక్కజొన్న దిగుబడులు, మార్కెట్ పరిస్థితులు, కొనుగోలు కేంద్రాల పనితీరు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మాట్లాడిన తుమ్మల నాగేశ్వరరావు, రైతులకు కనీస మద్దతు ధర కల్పించడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. పంటల కొనుగోలు విషయంలో కేంద్రం స్పష్టమైన విధానం అమలు చేయాల్సి ఉన్నప్పటికీ, అనుకున్న స్థాయిలో కొనుగోళ్లు జరగడం లేదని విమర్శించారు.

మొక్కజొన్న రైతులు అధిక పెట్టుబడులు పెట్టి పంట సాగు చేశారని, మార్కెట్‌లో కనీస ధరలు వస్తాయనే ఆశతో ఉత్పత్తిని సిద్ధం చేశారని చెప్పారు. అయితే కొనుగోళ్లలో జాప్యం, ధరల అనిశ్చితి కారణంగా రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.

రైతులు ఇప్పటికే సేకరించి నిల్వ ఉంచిన పంటలను కేంద్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని తుమ్మల డిమాండ్ చేశారు. కొనుగోళ్లలో ఆలస్యం కొనసాగితే రైతులపై అదనపు భారం పడుతుందని, నిల్వ వ్యయాలు పెరగడంతో పాటు నష్టాలు కూడా ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు.

వ్యవసాయ రంగం దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని పేర్కొన్న మంత్రి, రైతుల ప్రయోజనాలను కాపాడే విషయంలో కేంద్రం మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. కనీస మద్దతు ధర ప్రకటించడం మాత్రమే కాకుండా, ఆ ధరకు పంటలను కొనుగోలు చేసేలా సమర్థవంతమైన వ్యవస్థను అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.



రైతుల శ్రమకు తగిన ప్రతిఫలం అందేలా చర్యలు తీసుకోవాలని, మొక్కజొన్నతో పాటు ఇతర పంటల కొనుగోళ్ల విషయంలో కూడా కేంద్ర ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకోవాలని తుమ్మల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. రైతుల ఆర్థిక భద్రత, వ్యవసాయ రంగ స్థిరత్వం కోసం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు.

# వెయ్యి కోట్ల ప్రభుత్వ భూ కబ్జా కుట్ర

**అఖండసూర్య, హైదరాబాద్**

తెలంగాణ రాజధాని హైదరాబాద్ నగర శివార్లలో అత్యంత ఖరీదైన ప్రభుత్వ భూములను నకిలీ పత్రాలతో నొక్కేయాలని చూసిన పెద్ద కుట్ర కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ భారీ భూకబ్జా వ్యవహారంలో అరెస్టయిన వైఎస్సార్సీపీ మాజీ శాసనసభ్యుడు (ఎమ్మెల్యే) బొల్లా బ్రహ్మనాయుడిని విచారించేందుకు రంగారెడ్డి జిల్లా న్యాయస్థానం అనుమతించింది. సైబరాబాద్ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌ను పరిశీలించిన కోర్టు, ఆయనకు మూడు రోజుల పాటు పోలీస్ కస్టడీని మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. గండిపేట పరిధిలోని వెయ్యి కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాజేసేందుకు నకిలీ జీవోలు (ప్రభుత్వ ఉత్తర్వులు) సృష్టించారనే బలమైన ఆరోపణలు బ్రహ్మనాయుడిపై ఉన్నాయి. ఈ కేసులో ఇప్పటికే జైలులో ఉన్న ఇతర నిందితులతో బ్రహ్మనాయుడు జరిపిన భారీ ఆర్థిక లావాదేవీలపై మరిన్ని వివరాలు రాబట్టేందుకు పోలీసులు సిద్ధమయ్యారు. కోర్టు ఆదేశాల ప్రకారం రేపటి (మంగళవారం) నుంచి మూడు రోజుల పాటు ఆయన్ను పోలీసులు తమ కస్టడీలోకి తీసుకుని రహస్య ప్రదేశంలో విచారించనున్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా వినుకొండ నియోజకవర్గానికి చెందిన వైఎస్సార్సీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడిని సైబరాబాద్ పోలీసులు కొద్దిరోజుల క్రితం గుట్టుచప్పుడు కాకుండా అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. హైదరాబాద్ శివార్లలోని గండిపేట సర్వే నెంబర్18లో ఉన్న సుమారు 9.10 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని అక్రమ మార్గాల్లో తమ సొంతం చేసుకోవడానికి బ్రహ్మనాయుడు, ఆయన అనుచరుల బృందం (బ్యాచ్) పెద్ద ప్లాన్ వేసింది. ప్రభుత్వ రికార్డులను సైతం తారుమారు చేసి, నకిలీ జీవోలను సృష్టించి ఆ భూమిని క్రమబద్ధీకరణ (రెగ్యులరైజ్) చేయించుకోవాలని చూశారు. ఓ ప్రజాప్రతినిధి స్థాయి వ్యక్తి ఈ తరహా భూకబ్జా కుట్రలో భాగస్వామి కావడం ఐటీ కారిడార్‌తో పాటు రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది.

హైదరాబాద్ ఐటీ రంగానికి గుండెకాయ లాంటి కోకాపేట నియోపొలిస్ ప్రాంతంలో కొంతకాలం క్రితం ప్రభుత్వం నిర్వహించిన వేలంలో ఎకరం భూమి రికార్డు స్థాయిలో రూ.100 కోట్లకు పైగా పలికిన సంగతి అందరికీ తెలిసిందే. ఈ కోకాపేట నియోపొలిస్‌కు అత్యంత సమీపంలోనే గండిపేట గ్రామం ఉంది. ఇక్కడి సర్వే నెంబర్18లో తెలంగాణ ప్రభుత్వానికి చెందిన 104ఎకరాల 25 గుంటల భారీ భూమి అందుబాటులో ఉంది. ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం చూస్తే బ్రహ్మనాయుడు బ్యాచ్ కబ్జా చేయాలని చూసిన 9 ఎకరాల భూమి విలువ కనీసం రూ.1000 కోట్లకు పైగానే ఉంటుందని రెవెన్యూ మరియు పోలీస్ ఉన్నతాధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

వివాదాస్పదంగా మారిన గండిపేట సర్వే నెంబర్18 కి సంబంధించిన భూమి రికార్డులను రెవెన్యూ అధికారులు పూర్తిస్థాయిలో వెలికి తీశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నాటి 195455 రికార్డుల (ఖాస్రా పహానీ) ప్రకారం.. ఈ భూమి మొత్తం స్పష్టంగా 'పోరంబోకు కంచె' (ప్రభుత్వ సొంత భూమి) గా నమోదై ఉంది. తరతరాలుగా ప్రభుత్వ ఆధీనంలోనే ఉన్న ఈ ల్యాండ్ పై కన్నేసిన నిందితులు.. ఎలాగైనా దీన్ని ప్రైవేట్ వ్యక్తుల పేరిట మార్చేసి వేల కోట్లు సంపాదించాలని స్కెచ్ వేశారు. అందుకోసమే అత్యంత రహస్యంగా నకిలీ దస్తావేజులు, దొంగ జీవోలను పుట్టించారని దర్యాప్తులో తేలింది.

భూమిని చట్టబద్ధంగా మార్చుకునే ప్రక్రియలో భాగంగా నిందితులు మొదట ఒక వింత వ్యూహాన్ని అమలు చేశారు. గండిపేట సర్వే నెంబర్18 లోని కొంత భూమిని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా ఐదుగురు వ్యక్తులకు కేటాయించిందంటూ నకిలీ ఉత్తర్వుల కాపీలను సామాజిక మాధ్యమాల్లో వదిలారు. రియల్ ఎస్టేట్ గ్రూపులు, వాట్సప్ గ్రూపుల్లో ఈ సమాచారాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. తద్వారా ఆ భూమి ప్రభుత్వానిది కాదనే నమ్మకాన్ని మార్కెట్లో కల్పించి, ఆపై కబ్జా చేయాలని చూశారు. శేరిలింగంపల్లి డీసీపీ ఈ సోషల్ మీడియా ప్రచారాల వెనుక ఉన్న అసలు నిజాలను మీడియా ముందు ధ్రువీకరించారు.

ప్రభుత్వ భూమిని ప్రైవేట్ వ్యక్తులు అక్రమంగా క్రమబద్ధీకరించుకోవడానికి చూస్తున్నారనే వ్యవహారం గండిపేట మండల తహసీల్దార్ దృష్టికి వెళ్ళింది. దీనిపై తక్షణమే స్పందించిన తహసీల్దార్.. నకిలీ పత్రాలు సృష్టించిన ముఠాపై నార్సింగి పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమిని రక్షించడంతో పాటు నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. తహసీల్దార్ ఫిర్యాదు ఆధారంగా నార్సింగి పోలీసులు ఐపీసీ, ల్యాండ్ గ్రాబింగ్ చట్టాల కింద కేసులు నమోదు చేసి లోతుగా దర్యాప్తు ప్రారంభించారు.

కేసు నమోదు చేసిన అనంతరం పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. న్యాయస్థానం నుంచి ముందస్తు అనుమతి (సెర్చ్ వారెంట్) తీసుకున్న ప్రత్యేక పోలీస్ బృందాలు నిందితుల ఇళ్లు, కార్యాలయాలపై ఏకకాలంలో దాడులు చేసి విస్తృత సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ప్రభుత్వ ముద్రలు ఉన్న నకిలీ జీవో కాపీలు, కబ్జాకు ప్లాన్ చేసిన భూమికి సంబంధించిన కీలకమైన ఒరిజినల్ డాక్యుమెంట్లు, డైరీలు మరియు ల్యాండ్ మ్యాప్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ పత్రాలను, నిందితుల మొబైల్ ఫోన్ డేటాను విశ్లేషించగా.. ఈ మొత్తం వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడి పాత్ర సూత్రధారిగా ఉన్నట్లు పక్కా ఆధారాలు లభించాయని డీసీపీ స్పష్టం చేశారు.

తనపై కేసు నమోదైందనే విషయం తెలియగానే బొల్లా బ్రహ్మనాయుడు హైదరాబాద్ వదిలి పరారయ్యారు. అరెస్టు నుంచి తప్పించుకునేందుకు ఆయన తన ఫోన్లను స్విచ్ఛాఫ్ చేసి, వేర్వేరు రాష్ట్రాల్లో తలదాచుకునే ప్రయత్నం చేశారు. బ్రహ్మనాయుడి కోసం సైబరాబాద్ పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అంతటా విస్తృతంగా గాలించారు. సాంకేతిక పరిజ్ఞానం, మొబైల్ సిగ్నల్స్ ఆధారంగా ఎట్టకేలకు ఆయన ఉన్న ప్రాంతాన్ని కనిపెట్టి, పోలీసులు ఆయన్ను చుట్టుముట్టి అరెస్టు చేశారు. ఈ కేసులో బ్రహ్మనాయుడితో పాటు ఇప్పటికే మరో ముగ్గురు కీలక నిందితులను కూడా జైలుకు పంపినట్లు పోలీసులు వెల్లడించారు.

తాజాగా రంగారెడ్డి జిల్లా కోర్టు బొల్లా బ్రహ్మనాయుడికి మూడు రోజుల పోలీస్ కస్టడీ విధించడంతో ఈ కేసు ముగింపు దశకు వచ్చే అవకాశం కనిపిస్తోంది. రేపటి నుంచి ప్రారంభం కానున్న ఈ కస్టడీ విచారణలో పోలీసులు ప్రధానంగా కొన్ని అంశాలపై దృష్టి పెట్టనున్నారు. సచివాలయానికి సంబంధించిన నకిలీ జీవోలను ఏ కంప్యూటర్ లో, ఎవరి సహాయంతో తయారు చేశారు? ఈ వెయ్యి కోట్ల భూదందా వెనుక ఇంకా ఏవైనా రాజకీయ శక్తులు లేదా ఉన్నతాధికారుల హస్తం ఉందా? నకిలీ పత్రాల కోసం నిందితుల మధ్య ఎంత మొత్తం చేతులు మారింది? అనే కోణాల్లో పోలీసులు బ్రహ్మనాయుడిని నిలదీయనున్నారు. ఈ మూడు రోజుల విచారణ ముగిసిన తర్వాత ఈ భూ కబ్జా స్కామ్‌కు సంబంధించిన మరిన్ని సంచలన నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి.



# పెండింగ్ కేసులను పరిష్కరించాలి

- **వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహమేహర**

**వికారాబాద్ బ్యూరో జూన్ 15ఆశ్వి అప్డేట్స్**

పెండింగ్ కేసులను సత్యాన్ని పరీక్షించాలని జిల్లా ఎస్పీ స్నేహమేహర పోలీస్ అధికారులను ఆదేశించారు.జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, పెండింగ్ కేసుల సత్వర పరిష్కారమే లక్ష్యంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా సోమవారం జిల్లా పోలీసు అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఎస్పీ ప్రతి విభాగానికి సంబంధించిన పెండింగ్ ఫైళ్లను సమీక్షించారు. దర్యాప్తులో జరుగుతున్న జాప్యాలపై అధికారులను ప్రశ్నించారు. బాధితులకు సకాలంలో న్యాయం అందించడం పోలీసు వ్యవస్థ ప్రథమ కర్తవ్యమని పేర్కొంటూ, ప్రతి కేసును నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

పాత కేసుల ఛేదనపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ సూచించారు. జిల్లాలో నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు నిఘా నేత్ర కార్యక్రమం లో భాగంగా కొత్త సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, పనిచేయని పాత కెమెరాల మరమ్మతులు, అలాగే ప్రతి కెమెరాను జియోట్యాగింగ్ చేయాలని స్పష్టం చేశారు. తద్వారా నేరస్థలాల పర్యవేక్షణ క్షేత్రస్థాయిలో మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని తెలిపారు.

ప్రతి పోలీసు స్టేషన్‌లో 7 ఇంటిగ్రేటెడ్ ఫార్మ్స్‌ను సక్రమంగా అమలు చేయాలని సూచించారు. పోలీసు స్టేషన్‌కు సంబంధించిన ప్రతి అంశంపై ఎస్‌హెచ్‌ఓకు పూర్తి అవగాహన ఉండాలని పేర్కొన్నారు. ప్రతి పోలీసు స్టేషన్‌ను పరిశుభ్రంగా ఉంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రక్షణ నేత్రం, సురక్షా మిత్ర వంటి కార్యక్రమాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించి, వారిని కూడా ఈ కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్లను గుర్తించి, తగిన జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. విధుల నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన హెడ్ పోలీస్ సిబ్బంది కీ ఎస్పీ అభినందించి, రివార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు డీసీఆర్‌బీ డీఎస్పీ జానయ్య, డీటీసీ డీఎస్పీ శ్రీనివాసులు, వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, పరిగి డీఎస్పీ శ్రీనివాస్, తాండూర్ డీఎస్పీ నర్సింగ్ యాదయ్య,ఏఆర్ డీఎస్పీ వీరేష్,సీఐలు,ఎస్ఐలు , పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




# పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

- **వెంకటాపూర్ 92 బ్యాచ్ దోస్తుల ఆత్మీయ కలయిక**

**మొయినాబాద్,జూన్ 15 ఆశ్వి అప్డేట్స్**

మొయినాబాద్ మండలం వెంకటాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1992 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఘనంగా జరిగింది. ముప్పై ఏళ్ల తర్వాత నాటి మిత్రులంతా ఒకేచోట చేరి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు జాఫర్, అమృత్ రెడ్డిలను శాలువాలతో ఘనంగా సత్కరించి, గురుభక్తిని చాటుకున్నారు. దశాబ్దాలు గడిచినా తమను గుర్తుపెట్టుకుని సన్మానించడంపై గురువులు ఆనందం వ్యక్తం చేస్తూ విద్యార్థులను ఆశీర్వదించారు. చిన్ననాటి మిత్రులను మళ్లీ కలుసుకోవడంపై పూర్వ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.




# ఆర్యవైశ్య సేవాసమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు రమేష్ చంద్రకు సన్మానం

**వనపర్తి,జూన్ 15 ఆశ్వి అప్డేట్స్**

ఆర్యవైశ్య సేవాసమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఇటీవల నియమితులైన ఆర్‌సీ జ్యువెలరీ అధినేత కలకొండ రమేష్ చంద్రను పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు సన్మానించి అభినందించారు.సోమవారం ఆయన స్వగృహంలో నిర్వహించిన మాజీ కౌన్సిలర్లు కాగితాల లక్ష్మీనారాయణ, ఉంగ్లం తిరుమల్, బి ఆర్ ఎస్ నాయకులు నందిమల్ల అశోక్ పాల్గొని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్యవైశ్య సమాజ అభివృద్ధికి రమేష్ చంద్ర మరింత సేవలందించాలని ఆకాంక్షించారు.సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న రమేష్ చంద్రకు రాష్ట్ర స్థాయి పదవి రావడం అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులు అలంకరించి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు,స్థానిక నాయకులు పాల్గొన్నారు.



# కుత్బుల్లాపూర్‌లో స్కూల్ బస్సులపై ఆర్టీఏ ఉక్కుపాదం

- **పిల్లల ప్రాణాలతో చెలగాటమా..?**
- **హెవీ లైసెన్స్ లేకుండా బస్సులు నడుపుతున్న డ్రైవర్లు గుర్తింపు**
- **39 వాహనాలకు జరిమానాలు.. నిబంధనలు అతిక్రమిస్తే సీజ్ హెచ్చరిక**

**కుత్బుల్లాపూర్,జూన్ 15 ఆశ్వి అప్డేట్స్**



పాఠశాలలు పునఃప్రారంభమైన వేళ విద్యార్థుల భద్రత మరోసారి చర్చనీయాంశంగా మారింది. స్కూల్ బస్సుల నిర్వహణలో కొందరు యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు బయటపడటంతో మేడ్చల్ ఆర్టీఏ అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. కొంపల్లి, ఎన్సీఎల్, పైప్లైన్ రోడ్, సుచిత్ర, ఆర్టీవో కార్యాలయం పరిసర ప్రాంతాల్లో స్కూల్ బస్సులను క్షుణ్ణంగా తనిఖీ చేసి భద్రతా ప్రమాణాల అమలుపై ఆరా తీశారు.

తనిఖీల సమయంలో బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, డ్రైవర్ల అర్హతలు, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఎమర్జెన్సీ ఎగ్జిట్ డోర్లు, విద్యార్థుల సీటింగ్ సామర్థ్యం వంటి అంశాలను అధికారులు పరిశీలించారు. విద్యార్థుల రక్షణకు సంబంధించిన ప్రతి నిబంధన అమలులో ఉందా లేదా అన్న విషయంపై ప్రత్యేక దృష్టి సారించారు.

అయితే కొన్ని స్కూల్ బస్సులు సరైన హెవీ వెహికల్ లైసెన్స్ లేకుండానే నడుస్తున్నట్లు గుర్తించిన అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సాధారణ డ్రైవింగ్ లైసెన్స్‌తో పిల్లలను తరలించడం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. "పిల్లల ప్రాణాలతో ఎవరైనా చెలగాటం ఆడితే కఠిన చర్యలు తప్పవు" అని స్పష్టం చేశారు. మేడ్చల్ ఆర్టీవో పరిధిలో మొత్తం 39 స్కూల్ బస్సులకు వివిధ నిబంధనల ఉల్లంఘనల కారణంగా జరిమానాలు విధించినట్లు ఇంచార్జ్ డిటీఓ శ్రీనివాస్ తెలిపారు. అవసరమైతే నిబంధనలు అతిక్రమిస్తున్న వాహనాలను సీజ్ చేయడానికి వెనుకాడబోమని అధికారులు హెచ్చరించారు.

ఇటీవల దేశవ్యాప్తంగా చోటుచేసుకున్న పలు స్కూల్ బస్సు ప్రమాదాల నేపథ్యంలో ప్రభుత్వం కఠిన మార్గదర్శకాలు జారీ చేసినప్పటికీ, కొందరు విద్యాసంస్థల యాజమాన్యాలు ఇంకా నిర్లక్ష్య ధోరణినే కొనసాగిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. భద్రతా ప్రమాణాలను పక్కనబెట్టి విద్యార్థులను తరలించడం తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

స్కూల్ బస్సు అంటే కేవలం రవాణా వాహనం కాదు.. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రాణాలను నమ్మి అప్పగించే బాధ్యత. అలాంటి వ్యవస్థలో చిన్న నిర్లక్ష్యమే పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. తనిఖీలు ఒకరోజు కార్యక్రమంగా కాకుండా నిరంతర ప్రక్రియగా కొనసాగితేనే విద్యార్థుల భద్రతకు భరోసా కలుగుతుందని స్థానికులు కోరుతున్నారు.



# 25 ఏళ్ల తర్వాత ఒక్క వేదికపై కలిసిన మామిడిపల్లి జడ్పీహెచ్ఎస్ పూర్వ విద్యార్థులు


**మహేశ్వరం జూన్15 ఆశ్వి అప్డేట్స్:**

మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 20002001 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం హంస గార్డెన్‌లో ఎంతో ఘనంగా,ఆత్మీయ వాతావరణంలో నిర్వహించారు.పాఠశాల విద్యను పూర్తి చేసి 25 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. స్నేహితుల కలయికతో కార్యక్రమం పండుగ వాతావరణాన్ని తలపించింది.ఈ కార్యక్రమానికి అప్పటి ఉపాధ్యాయులు పద్మారావు సార్,సత్యం సార్,నర్సిరెడ్డి సార్,సుధాకర్ రెడ్డి సార్,నాగమణి టీచర్,శిరీష టీచర్,మాణిక్ ప్రభు సార్,శ్రీనివాస్ సార్‌లు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను అభినందించారు.ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ పాఠశాల అభివృద్ధికి మాజీ సర్పంచ్ ఈరంకి శంకర్ గౌడ్ అందించిన సేవలను ప్రత్యేకంగా గుర్తుచేసుకున్నారు.పాఠశాల గదుల నిర్మాణంతో పాటు విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా వాలంటీర్ ఉపాధ్యాయుల వేతనాల కోసం స్వంత నిధులు అందించి విద్యాభివృద్ధికి విశేషంగా తోడ్పడ్డారని కృతజ్ఞతలు తెలిపారు.ఉపాధ్యాయులు మాట్లాడుతూ 25 సంవత్సరాల తర్వాత కూడా విద్యార్థులు ఒకరినొకరు కలుసుకోవడం,తమ గురువులను,పాఠశాల అభివృద్ధికి సహకరించిన పెద్దలను గుర్తుంచుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు.విద్యార్థులు జీవితంలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో యాతం బాల్‌రాజ్ యాదవ్, ఈరంకి శ్యామ్‌కుమార్ గౌడ్,బి.లత, ఎం.వాణిశ్రీ, బి.ప్రవీణ్,ఎస్.సహదేవ్,జి.సరిత, ఎల్.లక్ష్మి ,పి.సభిత,ఈ.శ్రీశైలం,ఎస్.కె.మహబూబ్‌తో పాటు 20002001 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పూతలపట్టు సమన్వయకర్త డాక్టర్ సునీల్ కుమార్ ను సన్మానించిన గుండ్లకట్టమంచి మాజీ సర్పంచ్ చంద్రారెడ్డి.

**బంగారుపాలెం జూన్ 15 ఆశ్వి అప్డేట్స్**

చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలం గుండ్లకట్టమంచి పంచాయతీ కి చెందిన మాజీ సర్పంచ్ చంద్రారెడ్డి గత కొన్ని నెలలకు మునుపు యాక్సిడెంట్ ప్రమాదంలో కాలు కొంత దెబ్బ తినడంతో ఇంటి నందు విశ్రాంతి తీసుకోవడంతో ఒక సంవత్సరం పైగా వైఎస్ఆర్సిపి పార్టీకి దూరంగా ఉండిపోయారు. తిరిగి పాలేరు నందు పంచాయతీ బిఎల్ఎ సమావేశాలు జరుగుతుండడంతో, ఈ దినం నుండి పార్టీకి చురుగ్గా పాల్గొనాలని తన అనుచరులతో కలసి పాలేరు నందు జరిగిన కార్యక్రమంలో పూతలపట్టు సమన్వయకర్త మాజీ శాసనసభ్యులు డాక్టర్ సునీల్ కుమార్ కు శాలువా కప్పి పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. డాక్టర్ సునీల్ కుమార్ స్పందించి చంద్రారెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పాలేరు రామచంద్ర రెడ్డి, జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ ఎంబి కుమార్ రాజా, మండల వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, రైతు విభాగ అధ్యక్షులు ప్రవీణ్ రెడ్డి,ప్రకాష్ రెడ్డి,కిషోర్ కుమార్ రెడ్డి,ఖాదర్బాషా తదితరులు పాల్గొన్నారు.



# అమ్మ మాట అంగన్ వాడి బాట కార్యక్రమం నిర్వహణ

**గోదావరిఖని జూన్ 15 ఆశ్వి అప్డేట్స్**



రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి విఠల్ నగర్ అంగన్వాడి 04(2) 5 (5) కేంద్రాలలో అంగన్వాడి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామగుండం సీడీపీఓ హాజరై మాట్లాడుతూ 3 సంవత్సరాల నుండి 5 సంవత్సరాల పిల్లలను అంగన్వాడి కేంద్రానికి చేర్పించాలని అని ప్రీ స్కూల్ కి సంబంధించిన బుక్స్,వర్క్ బుక్స్ సిలబస్ అంగన్ వాడి కేంద్రంలో పిల్లలకు విద్యతో పాటు అట పాటలు మొదలగు నేర్పించే విధానాన్ని తల్లితండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రామగుండం (సీ డీ పీ ఓ) అలేఖ్య పటేల్ , సూపర్వైజర్ లిటిల్ , టీచర్స్ సఫియా,స్వరూప,ఆయాలు పద్మ ,లక్ష్మీ ,తదితరులు పాల్గొన్నారు.



# జి.వి.పి తొలగింపులో ప్రజల భాగస్వామ్యానికి సత్కారం

- **చెత్త రహిత చంద్రగిరి నగర్‌కు జోనల్ కమిషనర్ ప్రశంసలు**
- **వాటర్ లాగింగ్ ప్రాంతాలను పరిశీలించిన జెడ్సీ**
- **హైడ్రాతో సమన్వయం పెంచాలని సూచించిన జోనల్ కమిషనర్**

**కుత్బుల్లాపూర్,జూన్ 15 ఆశ్వి అప్డేట్స్:**

గాజులరామారం సర్కిల్ పరిధిలోని చంద్రగిరి నగర్‌లో శాశ్వతంగా తొలగించిన జి.వి.పి (గార్బేజ్ వల్నరబుల్ పాయింట్) ప్రాంతాన్ని జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గతంలో చెత్త పేరుకుపోయి ప్రజలకు ఇబ్బందిగా మారిన ఆ ప్రాంతాన్ని ప్రస్తుతం చెత్త రహితంగా, పరిశుభ్రమైన వాతావరణంతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దడాన్ని ఆయన అభినందించారు.

ఈ సందర్భంగా కాలనీ పరిశుభ్రత కోసం నిరంతరం కృషి చేసి, జి.వి.పి తొలగింపులో క్రియాశీలక పాత్ర పోషించిన స్థానిక ప్రజలను జోనల్ కమిషనర్ ఘనంగా సత్కరించారు. ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రమైన కాలనీలు సాధ్యమవుతాయని ఆయన పేర్కొన్నారు. అనంతరం కైలాష్ హిల్స్ మరియు మల్లారెడ్డి హాస్పిటల్ సమీప ప్రాంతాల్లో వర్షాల సమయంలో నీరు నిలిచే ప్రాంతాలను జోనల్ కమిషనర్ పరిశీలించారు. వర్షాకాలంలో ఎలాంటి వాటర్ లాగింగ్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా 'హైడ్రా' సిబ్బందితో నిరంతరం సమన్వయం కొనసాగించాలని సూచించారు. అవసరమైతే అదనపు మోటార్ పంపులను ముందుగానే సిద్ధంగా ఉంచి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు స్పష్టం చేశారు.

ఈ క్షేత్రస్థాయి తనిఖీల్లో డిప్యూటీ కమిషనర్ వెంకట్ రాములు, డీఈఈ ( ఎస్ డబ్ల్యూఎం ), డీఈఈ (ఇంజనీరింగ్)తో పాటు వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.





## మహాప్రస్థానంతో తెలుగు కవిత్వానికి కొత్త దిశ

- **వనపర్తిలో ఘనంగా మహాకవి శ్రీశ్రీ**
- **43వ వర్ధంతి నిర్వహణ**

**వనపర్తి,జూన్ 15 ఆశ్వి అప్డేట్స్:**

అభ్యుదయ కవితా వైతాళికుడు, విప్లవ కవిత్వానికి మార్గదర్శకుడు మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) 43వ వర్ధంతి వేడుకలు సోమవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర చైర్మన్, ప్రజావాగ్గేయకారుడు, వనపర్తి గద్దర్ గా పేరుగాంచిన రాజారాంప్రకాష్ అధ్యక్షత వహించారు.

ఈ సందర్భంగా రాజారాంప్రకాష్ మాట్లాడుతూ తెలుగు కవిత్వాన్ని సంప్రదాయ ఛందోబద్ధత నుంచి బయటకు తీసుకువచ్చి వచన కవిత్వానికి ప్రాణం పోసిన మహాకవి శ్రీశ్రీ అని కొనియాడారు. 'మహాప్రస్థానం' ద్వారా తెలుగు సాహిత్యంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. పీడిత ప్రజల పక్షాన నిలబడి, దోపిడీ వ్యవస్థపై తన కలం ద్వారా పోరాటం సాగించిన మహాకవి శ్రీశ్రీ రచనలు నేటికీ యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు.

"మానవుడే నా సందేశం... మనుష్యుడే నా సంగీతం" అనే భావజాలంతో సమాజ చైతన్యానికి కవిత్వాన్ని ఆయుధంగా మలిచిన మహోన్నత వ్యక్తి శ్రీశ్రీ అని తెలిపారు. కవిత్వం, కథ, నవల, నాటకం, వ్యాసం, విమర్శ, యాత్రాచరిత్ర, ఆత్మకథ తదితర సాహిత్య ప్రక్రియల్లో తనదైన ముద్ర వేసిన అరుదైన సాహితీవేత్తగా ఆయన నిలిచారని పేర్కొన్నారు.

అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడిగా, విప్లవ రచయితల సంఘం స్థాపక అధ్యక్షుడిగా విశేష సేవలందించిన శ్రీశ్రీ, తన రచనల ద్వారా సామాజిక చైతన్యాన్ని పెంపొందించారని అన్నారు. ప్రజల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడిన విప్లవ కవిగా ఆయన తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని తెలిపారు.

కార్యక్రమంలో కవిపండితుడు భూరోజు గిరిరాజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహశర్మ, గాయకుడు చింతకుంట కుర్మయ్య, విశ్రాంత ఇంజనీర్ శ్రీనివాసులు శెట్టి, విశ్రాంత ఉపాధ్యాయుడు జగపతిరావు, గంగపుత్ర సేవా సంఘం నాయకుడు సంగనముని వెంకటయ్య, డీహెచ్‌పీఎస్ జిల్లా నాయకుడు శేఖర్ తదితరులు పాల్గొన్నారు. వివిధ సంఘాల నాయకులు, విద్యార్థులు హాజరై మహాకవి శ్రీశ్రీకి నివాళులర్పించారు.

# ప్రభుత్వ పాఠశాలలే ప్రతిభకు చిరునామా

- **విద్యకు ప్రజా ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యం**
- **విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేసిన ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్**
- **డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి**

**వనపర్తి జూన్ 15 ఆశ్వి అప్డేట్స్**



ప్రభుత్వ పాఠశాలలు సమాజ అభివృద్ధికి పునాదులుగా నిలుస్తాయని, విద్యకు ప్రజా ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందని తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు.

గోపాల్‌పేట్ మండలంలోని జయన్న తిరుమలాపురం గ్రామ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యా సంవత్సరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేసి కొత్త విద్యా సంవత్సరానికి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మాట్లాడిన చిన్నారెడ్డి, ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రతిభను వెలికితీసే అనేక అవకాశాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఉదయం టిఫిన్, మధ్యాహ్న భోజనం, సాయంత్రం అల్పాహారంతో పాటు మెరుగైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందని తెలిపారు.

విద్యార్థులు అందుతున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. పాఠ్యాంశాలతో పాటు నైతిక విలువలను అలవర్చుకోవాలని హితవు పలికారు. ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే శిల్పులని కొనియాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు సమన్వయంతో పనిచేస్తే విద్యాభివృద్ధి మరింత వేగవంతమవుతుందని అన్నారు.

ప్రభుత్వ పాఠశాలల నుంచే దేశ భవిష్యత్తును నిర్మించే నాయకులు, శాస్త్రవేత్తలు, అధికారులు తయారవుతారని చిన్నారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 166 సర్వే నంబర్ రైతుల సమస్యపై ఎంపీ ఈటల రాజేందర్ జోక్యం

- **బౌరంపేట రైతులకు దుండిగల్ తరహాలో న్యాయం చేయాలి**
- **ల్యాండ్ పూలింగ్ ద్వారా పరిష్కారం చూపాలని బీజేపీ విజ్ఞప్తి**

**కుత్బుల్లాపూర్,జూన్ 15 ఆశ్వి అప్డేట్స్:**

బౌరంపేట 166 సర్వే నంబర్‌లోని లావణ్య పట్టా రైతుల సమస్యపై బీజేపీ నాయకులు మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాల వెనుక భాగంలో ఉన్న రైతులను ఎలాంటి నోటీసులు లేకుండా ఖాళీ చేయించాలని రెవెన్యూ అధికారులు ఒత్తిడి చేస్తున్నారని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు.

రైతులు మాట్లాడుతూ గత 70 సంవత్సరాలుగా అదే భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్నామని తెలిపారు. 1971లో లావణ్య పట్టాలు ఇచ్చారని, అనంతరం పహాణీ రికార్డుల్లో కూడా పేర్లు నమోదయ్యాయని చెప్పారు. తెలంగాణలో ధరణి అమలులోకి వచ్చిన తర్వాత తమ భూములు నమోదు కాకుండా ఆపివేశారని ఆరోపించారు.2017లో డబుల్ బెడ్‌రూమ్ నిర్మాణాల కోసం కొంత భూమి తీసుకున్నారని, ప్రస్తుతం మిగిలిన భూమిలో పశువుల పాకలు ఏర్పాటు చేసి పాడి పరిశ్రమ నిర్వహిస్తున్నామని రైతులు తెలిపారు. ఎలాంటి పరిహారం లేకుండా మిగిలిన భూమిని కూడా తీసుకోవడం వల్ల జీవనాధారం కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు.

రైతుల సమస్యలను విన్న ఎంపీ ఈటల రాజేందర్ జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించినట్లు తెలిపారు. అవసరమైతే ల్యాండ్ పూలింగ్ విధానంలో చర్చించి పరిష్కారం చూపాలని అధికారులకు సూచించినట్లు సమాచారం.

ఇటీవల దుండిగల్ రైతులతో జరిగిన చర్చల తరహాలోనే బౌరంపేట రైతులకు కూడా న్యాయం చేయాలని బీజేపీ నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా బీజేపీ ఇన్‌చార్జి అధ్యక్షులు డాక్టర్ ఎస్. మల్లారెడ్డి, దుండిగల్ సర్కిల్ బీజేపీ అధ్యక్షులు పీసరి కృష్ణారెడ్డి, దమ్మ ప్రభాకర్ రెడ్డి, రైతులు నల్ల రామచంద్రారెడ్డి, నాచారం మల్లేష్ యాదవ్, శ్రీశైలం యాదవ్, తలారి కృష్ణకుమార్ ముదిరాజ్, తలారి బాలకృష్ణ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.





## ఓటరు జాబితా సవరణలో బీఎల్ఏ2ల పాత్ర కీలకం

- **అలసత్వం వహిస్తే అడ్మినిస్ట్రేషన్‌కు ఇబ్బందులు**
- **త్వరలో బీసీ,ఎస్టీ,మైనార్టీ, మహిళ,ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుల నియామకం**
- **డీసీసీ చీఫ్,రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి**

**వనపర్తి,జూన్ 15 ఆశ్వి అప్డేట్స్**

కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టనున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా పునఃసమీక్ష (ఎస్ఐఆర్) ప్రక్రియలో బీఎల్ఏ2 సభ్యులు అత్యంత కీలకంగా వ్యవహరించాలని డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి సూచించారు. క్షేత్రస్థాయిలో బాధ్యతాయుతంగా పనిచేసి ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా, పట్టణ, మండల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన పట్టణ, మండల అధ్యక్షులకు విధి విధానాలపై దిశానిర్దేశం చేశారు.శివసేనారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి కార్యకర్తను కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం పెంచి, ఎవరికైనా ఇబ్బందులు ఎదురైతే వారిని సైతం కలుపుకొని ముందుకు సాగాలని కోరారు. భవిష్యత్తులో జరిగే అసెంబ్లీ, మున్సిపల్, సర్పంచ్ తదితర ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయపరంపర కొనసాగుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీల ద్వంద్వ వైఖరిని ప్రజలకు వివరించాలని, ఆ పార్టీల రాజకీయ వ్యూహాలను కాంగ్రెస్ శ్రేణులు తిప్పికొట్టాలని సూచించారు.ప్రతిపక్ష నాయకులు కాంగ్రెస్ పార్టీపై లేదా కార్యకర్తలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. అలాంటి వ్యాఖ్యలను వెంటనే ఖండిస్తూ సమర్థవంతంగా కౌంటర్ ఇవ్వాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు.ఈ సందర్భంగా కొత్తకోట పట్టణ, మండల అధ్యక్షులతో పాటు మదనాపురం మండల అధ్యక్షుడిగా ఎన్నికైన నాయకులకు నియామక పత్రాలను అందజేశారు. అలాగే త్వరలోనే బీసీ, ఎస్టీ, మైనార్టీ, మహిళా కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ విభాగాల అధ్యక్షులను నియమించనున్నట్లు ప్రకటించారు.

ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి,జిల్లా కార్యవర్గ సభ్యులు ఐ.సత్యరెడ్డి, కోళ్ల వెంకటేష్,శరవంద,మన్యం, బి.కృష్ణ,పట్టణ అధ్యక్షులు కదిరే రాములు,సహదేవు, దయాకర్‌రెడ్డి,రామ్‌రెడ్డి, సుఖేందర్‌రెడ్డి,విష్ణు ముదిరాజ్, రవికిరణ్,బోయెజ్ తదితరులు పాల్గొన్నారు.




## ఐదు లక్షల జనాభాకు సరిపోని నీటి సరఫరా

- **నీళ్లు లేవు...బిల్లులు మాత్రం రెగ్యులర్!**
- **వాటర్ వర్క్స్ ఎదుట జేఏసీ ధర్నా**
- **వారానికి ఒక్కసారి నీళ్లు... ప్రజల్లో అసహనం**

**కుత్బుల్లాపూర్,జూన్ 15 ఆశ్వి అప్డేట్స్**

నగరం విస్తరిస్తోంది... జనాభా పెరుగుతోంది... కానీ ప్రాథమిక అవసరమైన తాగునీటి సరఫరా మాత్రం అదే స్థాయిలో ఉండిపోవడంతో నిజాంపేట్ సర్కిల్ పరిధిలో రోజురోజుకూ తీవ్రమవుతున్న తాగునీటి సమస్యపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్యల పరిష్కారం కోసం స్థానిక ప్రజలు, ప్రజాసంఘాల ప్రతినిధులు, నిజాంపేట్ సర్కిల్ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం ప్రగతి నగర్ వాటర్ వర్క్స్ ఫిల్లింగ్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ జనరల్ మేనేజర్ నాగ పరిమళ, డిప్యూటీ జనరల్ మేనేజర్ రజనీకాంత్ రెడ్డి అక్కడికి చేరుకుని ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. తాగునీటి కొరత, పైప్‌లైన్ లీకేజీలు, ట్యాంకర్ల ద్వారా నీటి విక్రయాలు, కనీస బిల్లుల వసూళ్లు, సిబ్బంది కొరత వంటి అంశాలపై జేఏసీ ప్రతినిధులు అధికారులకు వినతిపత్రం అందజేశారు.

సుమారు ఐదు లక్షల జనాభా ఉన్న నిజాంపేట్ సర్కిల్‌కు అవసరమైన స్థాయిలో నీటి సరఫరా జరగడం లేదని ప్రజలు ఆరోపించారు. వారానికి ఒక్కసారి మాత్రమే నీటి సరఫరా జరుగుతుండగా, మరోవైపు కనీస బిల్లులు వసూలు చేయడం అన్యాయమని మండిపడ్డారు. గత పదేళ్లుగా ట్రాన్స్‌మిషన్ అలోకేషన్ ఆర్డర్ (TAO) పెంచకపోవడం వల్లే సమస్య మరింత తీవ్రమైందని తెలిపారు. ప్రగతి నగర్‌కు రోజుకు 1 కోటి లీటర్లు, నిజాంపేట్-బాచుపల్లి ప్రాంతాలకు 2 కోట్ల లీటర్ల నీటి సరఫరా కల్పించాలని ప్రజలు డిమాండ్ చేశారు. అదనంగా నిల్వ ట్యాంకుల నిర్మాణం, రోజు విడిచి రోజు నీటి సరఫరా, ట్యాంకర్ నీటి విక్రయాలపై విచారణ చేపట్టాలని కోరారు. ప్రజల సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. అయితే వారం రోజుల్లోగా స్పష్టమైన చర్యలు ప్రారంభించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని జేఏసీ ప్రతినిధులు హెచ్చరించారు.



# మ్యాచ్ డ్రా.. సంస్కృతి విన్.. జపాన్ అభిమానులపై ప్రశంసల వర్షం

- **ఫిఫా 2026 ప్రపంచకప్‌లో జపాన్, నెదర్లాండ్స్ మ్యాచ్ 2-2తో డ్రా**
- **మ్యాచ్ అనంతరం టెక్సాస్ స్టేడియాన్ని శుభ్రం చేసిన జపాన్ అభిమానులు**
- **చెత్తను సేకరించేందుకు నీలిరంగు ప్లాస్టిక్ సంచులను వినియోగం**
- **1998 నుంచి ఈ సంప్రదాయాన్ని పాటిస్తున్న జపాన్ ఫ్యాన్స్**
- **వారి క్రమశిక్షణ, సామాజిక బాధ్యతపై ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు**



**ఆశ్వి అప్డేట్స్:**

ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో మ్యాచ్ ఫలితం ఎలా ఉన్నా.. జపాన్ అభిమానులు మాత్రం తమ సంస్కృతి, క్రమశిక్షణతో ఎప్పుడూ మనసులను గెలుచుకుంటూ ఉంటారు. 2026 ఫిఫా ప్రపంచకప్‌లోనూ అదే సంప్రదాయాన్ని కొనసాగించి మరోసారి ప్రపంచంతో ప్రశంసలు అందుకుంటున్నారు. ఆదివారం టెక్సాస్‌లోని ఏటీఅండ్‌టీ స్టేడియంలో నెదర్లాండ్స్‌తో జరిగిన గ్రూప్‌ఎఫ్ మ్యాచ్ ముగిసిన తర్వాత వారు ప్రదర్శించిన క్రీడాస్ఫూర్తి అందరినీ ఆకట్టుకుంది.

హోరాహోరీగా సాగిన ఈ మ్యాచ్ 22 గోల్స్‌తో డ్రాగా ముగిసింది. మ్యాచ్ ముగియగానే దాదాపు 69,000 మంది ప్రేక్షకులు స్టేడియం నుంచి వెళ్లిపోతుండగా, జపాన్ అభిమానులు మాత్రం తమ సీట్లలోనే ఉండిపోయారు. వారు తమతో తెచ్చుకున్న నీలిరంగు ప్లాస్టిక్ సంచులతో గ్యాలరీల్లో పేరుకుపోయిన ఖాళీ బాటిళ్లు, ప్యాకెట్లు, ఇతర చెత్తను ఓపికగా ఏరడం ప్రారంభించారు. 'ది ఇండిపెండెంట్' కథనం ప్రకారం తాము కూర్చున్న సెక్షన్‌ను పూర్తిగా శుభ్రం చేసిన తర్వాతే వారు స్టేడియం విడిచి వెళ్లారు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారి, నెటిజన్ల మనసులను గెలుచుకుంటున్నాయి.

జపాన్ అభిమానులకు ఇది కొత్తేమీ కాదు. 1998లో ఫ్రాన్స్‌లో జరిగిన ప్రపంచకప్‌లో తొలిసారి పాల్గొన్నప్పటి నుంచి ప్రతి టోర్నమెంట్‌లోనూ వారు ఈ పద్ధతిని పాటిస్తున్నారు. 2022 ఖతార్ ప్రపంచకప్‌లోనూ జర్మనీపై గెలిచిన తర్వాత స్టేడియాన్ని శుభ్రం చేసి వార్తల్లో నిలిచారు. ఈ క్రమశిక్షణకు మూలాలు వారి విద్యా వ్యవస్థలోనే ఉన్నాయి. జపాన్‌లో 'సౌజి' పేరుతో పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు తమ పరిసరాలను తామే శుభ్రం చేసుకోవడాన్ని నేర్పిస్తారు.

గెలుపోటములతో సంబంధం లేకుండా సామాజిక బాధ్యతను ప్రదర్శించడం ద్వారా జపాన్ అభిమానులు మరోసారి క్రీడాస్ఫూర్తికి సరికొత్త నిర్వచనం ఇచ్చారు. వారి పారిశుధ్య కార్యక్రమంలో స్థానిక ఎన్‌ఎఫ్‌ఎల్ ప్లేయర్ జేమిస్ విన్‌స్టన్ కూడా పాలుపంచుకోవడం విశేషం.

# నరేందర్ నాయక్‌కు మద్దతుగాన్యాయవాదుల విధుల బహిష్కరణ

- పాలమూరు జిల్లా వ్యాప్తంగా కోర్టు కార్యకలాపాలకు దూరం

**వనపర్తి,జూన్ 15 ఆశ్వి అప్డేట్స్:**



మహబూబ్‌నగర్ బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాది నరేందర్ నాయక్‌కు మద్దతుగా పాలమూరు జిల్లా వ్యాప్తంగా న్యాయవాదులు సోమవారం విధులను బహిష్కరించారు. శనివారం రాత్రి జరిగిన ఘటన నేపథ్యంలో నరేందర్ నాయక్‌పై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌పై న్యాయవాదుల్లో ఆందోళన వ్యక్తమవుతోందని యునైటెడ్ మహబూబ్‌నగర్ జిల్లా జూనియర్ అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నసనల్లి రాజు సాగర్ తెలిపారు. న్యాయవాదుల గౌరవం, వృత్తిపరమైన హక్కుల పరిరక్షణ కోసం ఈ నిరసన చేపట్టినట్లు పేర్కొన్నారు. నరేందర్ నాయక్ వ్యవహారంపై నిష్పక్షపాత విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని ప్రభుత్వాన్ని కోరారు.



## బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి

- కొండాపూర్ ప్రాథమిక పాఠశాలలో సాధన సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

**పెద్దేముల్,జూన్ 15 ఆశ్వి అప్డేట్స్:**

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన వ్యవస్థ కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కొండాపూర్ ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం గోబ్ర్యా నాయక్ అన్నారు. సోమవారం పెద్దేముల్ మండల పరిధిలోని కొండాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్య వివాహాల నివారణ, మానవ అక్రమ రవాణా,బాలల అక్రమ రవాణా వంటి సామాజిక సమస్యలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు సాధన సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు బాలల హక్కులు, విద్య ప్రాముఖ్యత, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, బాల కార్మిక వ్యవస్థ చట్ట విరుద్ధత, మానవ అక్రమ రవాణా ప్రమాదాల గురించి క్లుప్తంగా వివరించారు.ఈ కార్యక్రమంలో కొండాపూర్ ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం గోబ్ర్యా నాయక్ మాట్లాడుతూ... ప్రతి బాలుడు విద్యను అభ్యసించే హక్కు కలిగి ఉన్నాడని,బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని అన్నారు. విద్యార్థులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండి చదువులో ముందంజ వేయాలని సూచించారు.సాధన సంస్థ పెద్దేముల్ మండల కోఆర్డినేటర్ జి.రమేష్ మాట్లాడుతూ బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ, బాలల అక్రమ రవాణా వంటి సమస్యలు సమాజ అభివృద్ధికి ఆటంకంగా మారుతున్నాయని తెలిపారు.ఇలాంటి సంఘటనలు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. బాలల రక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలు,సంక్షేమ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు .ఈ కార్యక్రమంలో కొండాపూర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సలీం, సంతోష్ కుమార్, పాఠశాల విద్యార్థులు,సాధన సంస్థ ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టును పరామర్శించిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు..

- జర్నలిస్టులకు రక్షణ కల్పించాలి దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి...
- బీ ఆర్ ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ తక్కల్లపల్లి రవీందర్ రావు..

**నర్సంపేట్ జూన్ 15 ఆశ్వి అప్డేట్స్:**

వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలో సీనియర్ జర్నలిస్ట్ పాలంచ సత్యనారాయణపై జరిగిన దాడిని భారత రాష్ట్ర సమితి (BRS) పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది.ఈ ఘటనపై మాజీ ఎమ్మెల్యే శ్రీ పెద్ది సుదర్శన్ రెడ్డి సూచన మేరకు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు వారి స్వగృహంలో పరామర్శించినారుదాడి మీద స్పందిస్తూ జర్నలిస్టులపై ఇలాంటి భౌతిక దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికే ప్రమాదం అని పేర్కొన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.**జర్నలిస్టులకు రక్షణ కల్పించి శాంతిభద్రతలను కాపాడాలని కోరారుదాడి జరిగి నాలుగు రోజులు గడుస్తున్న ఇప్పటివరకు నిందితుని అరెస్టు చేయలేదు. నర్సంపేట పట్టణంలో అడుగు అడుగున ఇలాంటి సంఘటన పట్ల పోలీసులు తక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు పట్టణ ప్రజలకు రక్షణ కల్పించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నాం ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఖానీజా ఆబివృద్ధి సంస్థ డైరెక్టర్ నాడం శాంతి కుమార్ పార్టీ కౌన్సిలర్ మండల శ్రీదేవి శ్రీనివాస్ , కాంటెస్టెడ్ కౌన్సిలర్లు పెండమ్ శివానంద మోతే తిరుపతి రెడ్డి బీరం నాగిరెడ్డి పార్టీ నాయకులు నాడం నగేష్ జగ్గారావు ఇతర నాయకులు పాల్గొన్నారు.








# బ్రిడ్జి పోరాటం

- నేరడ–గాదిరెడ్డిపల్లె అనుసంధాన బ్రిడ్జి నిర్మాణానికి రైతుల గళం
- 100 మందికి పైగా రైతులతో కలెక్టరేట్‌కు కాసోజు శంకరాచారి నేతృత్వంలో భారీ ర్యాలీ
- రాకపోకల కష్టాలు.. వర్షా కాలం వస్తే గ్రామాలకు శాపమే
- సానుకూలంగా స్పందించిన కలెక్టర్.. అధికారులకు వెంటనే ఆదేశాలు

**నల్లగొండ, జూన్ 15 ఆశ్వి అప్డేట్స్:**

"ప్రజల ప్రాణాల కంటే విలువైనది ఏముంది..? దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న మా బ్రిడ్జి కల ఎప్పుడు నెరవేరుతుంది..?" అంటూ నేరడ-గాదిరెడ్డిపల్లె గ్రామాల రైతులు, ప్రజలు సోమవారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి పరిష్కారం కాని సమస్యపై మరోసారి గళమెత్తిన ఇరు గ్రామాల ప్రజలు, రైతులు కాసోజు శంకరాచారి నాయకత్వంలో భారీ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాసోజు శంకరాచారి మాట్లాడుతూ, నేరడ-గాదిరెడ్డిపల్లె గ్రామాల ప్రజలకు కనీస అనుసంధాన బ్రిడ్జి సౌకర్యం లేకపోవడం విచారకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారినా, ప్రజాప్రతినిధులు మారినా, అధికారుల పర్యటనలు జరిగినా ప్రజల కష్టాలు మాత్రం మారలేదన్నారు. వర్షాకాలం ప్రారంభమైతే గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా స్తంభించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న ఈ ప్రాంత రైతులు తమ పొలాలకు వెళ్లాలన్నా, పండించిన పంటలను మార్కెట్‌కు తరలించాలన్నా నానా అవస్థలు పడుతున్నారని అన్నారు. రహదారి లేక రైతుల శ్రమ వృథా అవుతుండగా, పంట దిగుబడులు వచ్చినా సరైన రవాణా సౌకర్యం లేక నష్టాలు చవిచూడాల్సి వస్తోందని పేర్కొన్నారు. అభివృద్ధి మాటల్లోనే మిగిలిపోయి, గ్రామీణ ప్రజల ప్రాథమిక అవసరాలు మాత్రం ఇప్పటికీ నెరవేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో పరిస్థితి మరింత దయనీయంగా మారుతోందన్నారు. గర్భిణీలు, అనారోగ్యంతో బాధపడుతున్న రోగులు, వృద్ధులను ఆసుపత్రులకు తరలించేందుకు ప్రత్యామ్నాయ మార్గాల కోసం గంటల తరబడి తిరగాల్సి వస్తోందని తెలిపారు. కొన్నిసార్లు ప్రాణాపాయ పరిస్థితులు కూడా ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతూ విద్యకు దూరమవుతున్న పరిస్థితులు నెలకొన్నాయని చెప్పారు. "ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడిన తర్వాత స్పందించడం కాదు.. ప్రమాదాలు జరగకముందే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి" అని రైతులు స్పష్టం చేశారు. నేరడ-గాదిరెడ్డిపల్లె మధ్య అనుసంధాన బ్రిడ్జి నిర్మాణం కేవలం ఒక అభివృద్ధి పనికాదని, వేలాది మంది ప్రజల జీవనాడిని కలిపే ప్రాజెక్ట్ అని పేర్కొన్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే వ్యవసాయం, విద్య, వైద్యం, రవాణా రంగాల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటాయని వివరించారు. రైతుల గోడును శ్రద్ధగా విన్న జిల్లా కలెక్టర్ సమస్యను అత్యంత ప్రాధాన్యంగా పరిగణించి సంబంధిత శాఖల అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేసినట్లు కాసోజు శంకరాచారి తెలిపారు. ఆర్ అండ్ బి శాఖ సూపరింటెండింగ్ ఇంజనీర్‌తో పాటు ఇతర అధికారులను రైతుల సమక్షంలోనే స్థల పరిశీలన నిర్వహించి నివేదిక సమర్పించాలని ఆదేశించినట్లు వెల్లడించారు. సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు త్వరలోనే ప్రారంభమవుతాయని కలెక్టర్ భరోసా ఇచ్చారని తెలిపారు. కలెక్టర్ స్పందనపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ, ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న తమ పోరాటానికి ఫలితం దక్కే రోజు దగ్గరపడిందని ఆశాభావం వ్యక్తం చేశారు. అవసరమైతే మరింత పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టి బ్రిడ్జి నిర్మాణం సాధించుకుంటామని రైతులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మర్ల రాజ్యలక్ష్మి, ఆవుల సైదమ్మ, మంద యశోద, ఆవుల యాదమ్మ, ఆవుల కవిత, వల్లపు పద్మ, వల్లపు సుజాత, చిరుగోని సాలమ్మ, తీగల కృష్ణారావు, తీగల వెంకటరావు, రామగిరి వసంతరావు, మర్ల ఉమారెడ్డి, ఆవుల నరసింహ, ఆవుల శ్రీను, వల్లపు శ్రీశైలం, చిరుగోని మల్లేష్, కడారి శంకర్, వల్లపు వెంకన్నలతో పాటు గ్రామ నాయకులు మర్ల రామ్‌రెడ్డి, గంజి కృష్ణయ్య, సన్యాసిరావు, మంద వేణుగోపాల్‌రెడ్డి, ప్రిన్స్ రమేష్‌బాబు, మిరియాల మురళీకృష్ణ, గంజి గోవర్ధన్, వీరమల్ల అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. నేరడగాదిరెడ్డిపల్లె గ్రామాల నుంచి పెద్ద ఎత్తున రైతులు, మహిళలు, యువకులు హాజరై "బ్రిడ్జి మా హక్కు - నిర్మాణం వెంటనే చేపట్టాలి" అంటూ నినాదాలు చేశారు.

## కష్టంలో ఉన్న పేదవారికి ప్రత్యక్ష దైవం డాక్టర్ హకీమ్

- బిఆర్ఎస్ బాన్సువాడ నియోజకవర్గ నాయకులు జుబేర్
- పెట్టి పుట్టడం అనే నానుడికి నిదర్శనం డాక్టర్ హకీమ్ జీవితం
- కోటగిరి బిఆర్ఎస్ నాయకులు తేల్ల రవికుమార్
- పేద ప్రజలను ఆదుకునే గొప్ప మనసున్న మనిషి డాక్టర్ హకీమ్
- పోతంగల్ మండల బీఆర్ఎస్ నాయకుడు సూధం నవీన్

**బాన్సువాడ,జూన్ 15 ఆశ్వి అప్డేట్స్:**

బాన్సువాడ నియోజకవర్గం పోతంగల్ మండల కేంద్రంలో సామాజిక సేవకర్త డాక్టర్ హకీమ్ జన్మదిన వేడుకలను బిఆర్ఎస్ పార్టీ నాయకులు, డాక్టర్ హకీమ్ అభిమానుల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని బాన్సువాడ నియోజకవర్గ నాయకులు జుబేర్ ప్రారంభించిన అనంతరం హకీం జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి ఆయనకు కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బాన్సువాడ నియోజకవర్గ బి ఆర్ ఎస్ నాయకులు జుబేర్ మాట్లాడుతూ... పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు కష్టం వస్తే నేనున్నానంటూ ముందుకు వచ్చి సహాయం అందిస్తున్న పేదప్రజల ప్రత్యక్ష దైవం డాక్టర్ హకీం సేవలు మున్ముందు మరిన్ని కొనసాగాలని ఆకాంక్షించారు. ఆయన ఇలాంటి పుట్టినరోజు వేడుకలను మరెన్నో జరుపుకోవాలని కోరుతూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కోటగిరి మండల టిఆర్ఎస్ నాయకులు తేల్ల రవికుమార్ మాట్లాడుతూ... పెట్టి పుట్టడం అనే నానుడికి డాక్టర్ హకీం జీవితం నిదర్శనమని అన్నారు. ఈ జన్మలో మనం పేద ప్రజల కోసం ఖర్చు పెడితేనే, ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటేనే ఆ దేవుని ఆశీర్వాదం మనకు కలుగుతుందని మనకు మరో జన్మ ఉంటుందని అన్నారు. హకీమ్ ఆ దేవుడి ఆశీర్వాదంతో పేద ప్రజలకు చేస్తున్న సేవలు ప్రతి గ్రామంలో కనిపిస్తున్నాయని అన్నారు. కుల మత వర్గ వర్ణ భేదాలు లేకుండా ఆపదలో ఉన్న ప్రతి గడపకి వెళ్లి తన వంతు సహాయం చేయడం హకీమ్ గొప్పతనం అని అన్నారు. పోతంగల్ మండల టిఆర్ఎస్ నాయకుడు సూధం నవీన్ మాట్లాడుతూ... ఆపదలో ఉన్నవారికి ఆదుకునే ఆపద్బాంధవుడు గొప్ప మనసున్న వ్యక్తి డాక్టర్ హకీం అని గుర్తు చేశారు. పోతంగల్ మండలంలో ఎందరో నాయకులకు ఐశ్వర్యం ఉన్నా దానం చేసే గుణం మాత్రం డాక్టర్ హకీంకు మాత్రమే ఉండడం ఆయన గొప్పతనం అని అన్నారు. అవసరంలో ఉన్న పేదలకు ఎల్లప్పుడూ అండగా ఉండే హకీం లాంటి వ్యక్తులు ఈ సమాజంలో చాలా అరుదుగా ఉంటారని అలాంటి వారికి భగవంతుడు నిండు నూరేళ్ల ఆయురారోగ్యాలు ప్రసాదించి మంచి భవిష్యత్తును ఇవ్వాలని కోరారు.రాష్ట్ర బీఆర్ఎస్ విద్యార్థి సంఘం నాయకులు సాయిబాబా, బాన్సువాడ నియోజకవర్గం మాల మహానాడు అధ్యక్షులు మీర్జాపూర్ సాయన్న. ఎం ఆర్ పీ ఎస్ జిల్లా సహాయ కార్యదర్శి సోంపూర్ పోచిరాం ,డాక్టర్ హకీమ్ స్నేహితులు డాక్టర్ నాగయ్య, లక్ష్మణ్ సార్, ఆయా గ్రామాల అభిమానులు స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.



## తొలి రోజే స్కూల్‌కు తాళం

- చందాపూర్ హైస్కూల్ వద్ద కాంట్రాక్టర్ల ధర్నా

**వనపర్తి,జూన్ 15 ఆశ్వి అప్డేట్స్:**

విద్యాసంవత్సరం ప్రారంభమైన తొలి రోజే చందాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధాన గేటుకు కాంట్రాక్టర్లు తాళం వేసి ధర్నా చేపట్టారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.దీంతో పాఠశాలకు వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులు కొంతసేపు గేటు బయటే నిలిచిపోయారు. సమాచారం అందుకున్న మండల విద్యాశాఖ అధికారి, స్థానిక ప్రజాప్రతినిధులు సంఘటనా స్థలానికి చేరుకుని కాంట్రాక్టర్లతో చర్చలు జరిపారు. సమస్య పరిష్కారానికి జిల్లా అధికారుల దృష్టికి వెళ్లి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించగా, అనంతరం పాఠశాల కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి.పాఠశాల ప్రారంభమైన తొలి రోజే ఈ ఘటన చోటుచేసుకోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

## నిరుపేద విద్యార్థులకు అండగా ఇక్షణ ఫౌండేషన్

- కొండాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఇక్షణ ఫౌండేషన్ చేయూత
- 100 మంది విద్యార్థులకు సరిపడ షూస్ పంపిణీ
- నిరుపేద గిరిజన, అంగవైకల్యం కలిగిన విద్యార్థుల చదువులకు సహాయం: సోషల్ వర్కర్ రాజశేఖర్ రెడ్డి
- విద్యార్థుల విద్యా అభివృద్ధికి ఇక్షణ ఫౌండేషన్ అందిస్తున్న సేవలు భేష్
- కొండాపూర్ ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం గోబ్ర్యా నాయక్

**పెద్దేముల్,జూన్ 15 ఆశ్వి అప్డేట్స్:**

గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొనే నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఇక్షణ ఫౌండేషన్ అండగా నిలుస్తుందని కొండాపూర్ ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం గోబ్ర్యా నాయక్ అన్నారు.సోమవారం మండల పరిధిలోని కొండాపూర్ ప్రాథమిక పాఠశాలలో పాఠశాల ప్రారంభం మొదటి రోజునే ఇక్షణ ఫౌండేషన్ సౌజన్యంతో సుమారు 100 మంది విద్యార్థులకు సరిపడ షూస్ లను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఇక్షణ ఫౌండేషన్ ప్రతినిధులు,సోషల్ వర్కర్లు రాజశేఖర్ రెడ్డి, సాయి, శ్రావణ్, కొండాపూర్ గ్రామ పెద్దలతో కలిసి విద్యార్థులకు షూస్ లను అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం గోబ్ర్యా నాయక్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ఇక్షణ ఫౌండేషన్ నిరంతరం అండగా నిలుస్తోందన్నారు.గతంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, టైలు, బెల్టులు, షూస్ వంటి విద్యా సామగ్రిని పంపిణీ చేసిన ఫౌండేషన్,ఈ ఏడాది కూడా విద్యార్థులకు షూస్ అందించడం సంతోషకరమని పేర్కొన్నారు.ఇక్షణ ఫౌండేషన్ ప్రతినిధులు రాజశేఖర్ రెడ్డి, సాయి,శ్రావణ్ లు మాట్లాడుతూ జీవితంలో సంపాదించిన దానిలో కొంత భాగాన్ని మానవతా దృక్పథంతో నిరుపేద విద్యార్థుల చదువుల కోసం ఖర్చు చేస్తే ఎంతో సంతృప్తి లభిస్తుందన్నారు.ఇక్షణ ఫౌండేషన్ ద్వారా గిరిజన విద్యార్థులు, అంగవైకల్యం కలిగిన విద్యార్థులు, అంధ విద్యార్థుల విద్యాభ్యాసానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు.విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. అదే విధంగా విద్యార్థులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలను,నోటు బుక్ లను పంపిణీ చేశారు.అనంతరం పాఠశాల తరపున పాఠశాల హెచ్ఎం గోబ్ర్యా నాయక్,పాఠశాల సిబ్బంది ఇక్షణ ఫౌండేషన్ ప్రతినిధులు,అతిథులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఎపీసీ చైర్ పర్సన్ సరిత, పాఠశాల ఉపాధ్యాయులు సలీం,సంతోష్ కుమార్, గ్రామ పెద్దలు ఇసాక్, కిషన్ నాయక్, వెంకటయ్య, లూకాస్,పంచాయతీ కార్యదర్శి రమేష్,విద్యార్థులు,తల్లిదండ్రులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





# రాజకీయ చదరంగంలో ప్రాంతీయ పార్టీలు

## అస్తిత్వ పోరాటమా? ఆత్మసమర్పణమా?

కాంగ్రెస్ నుంచి విడివడి ఏర్పడ్డ ప్రాంతీయ పార్టీలు అన్నీ మళ్లీ కాంగ్రెస్‌లో విలీనం కావాలని, అప్పుడే బిజెపి వ్యతిరేక పోరాటం బలోపేతం అవుతుందని శివసేన ఎంపి సంజయ్ రౌత్ ఈ మధ్య సంచలన వ్యాఖ్యలు చేశారు. తృణమూల్ కాంగ్రెస్, శరద్ పవార్ పార్టీలను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన ఎందుకు అన్నారో కానీ, బిజెపిని దెబ్బతీయాలంటే కాంగ్రెస్ బలోపేతం కావాలన్న ఉద్దేశ్యంతో అలా అని వుంటారు. రెండు పార్టీల వ్యవస్థ ఉండివుంటే ఇలాంటిదే జరుగుతుంది. ఇష్టమున్న పార్టీలు ఆ రెండు పార్టీల్లో చేరుతాయి. అది బిజెపి లేదా కాంగ్రెస్ కావచ్చు. కానీ భారత ప్రజాస్వామ్యంలో ప్రాంతాయ పార్టీల పాత్రను తక్కువగా అంచనావేయలేం. ఒకప్పుడు కాంగ్రెస్ ఏకఛత్రాధిపత్యంగా, నిరంకుశంగా చేస్తున్న పాలనకు వ్యతిరేకంగా ప్రాంతీయ పార్టీలు పుట్టుకురావడం చూశాం. కమ్యూనిస్టులు పూర్తిగా బలహీనపడి, దేశంలో కమ్యూనిజం అంతం కావడంతో ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో బిజెపి, కాంగ్రెస్ పార్టీలతో పాటు కొన్ని ప్రాంతీయ పార్టలు తమ ప్రభావం చూపుతున్నాయి. ఉమ్మడి ఎపిలో కాంగ్రెస్ నిరంకుశ పాలనపై ఎన్టీఆర్ తిరుగుబాటు చేశారు. తెలుగుదేశం పార్టీ ఏర్పడి ఇప్పటికీ బలంగా నిలిచింది. ఇటీవల తమిళనాడులో ద్రవిడ పార్టీలపై యుద్ధం ప్రకటించిన టివికె పార్టీ ఏకంగా అధికారంలోకి వచ్చింది. ఇలా చెప్పుకుంటూ పోతే అనేక ప్రాంతీయ పార్టీలు ఇప్పుడు మనుగడ సాగిస్తున్నాయి. ఆయా పార్టీలు కాంగ్రెస్‌లో విలీనం అయితే జరిగేది కాంగ్రెస్ బలోపేతం మాత్రమే. కాంగ్రెస్ దేశంలో కుటుంబ పాలన సాగిస్తున్న పార్టీ. అక్కడ సోనియా, రాహుల్, ప్రియాంకల పెత్తనం తప్ప ఇతరులకు అఇకారం ఉండదు. పేరుకే ఖర్గే జాతీయ పార్టీ అధ్యక్షుడు. ఆయన మాట కూడా చెట్టుబాటు కాదు. అలాంటి పార్టీలో ప్రాంతీయ పార్టీల విలీనం కావాలన్న ఆలోచన సరికాదు. దీంతో ఎలాంటి రాజకీయ ప్రయోజనం ఉండదు. అందువల్ల సంజయ్ రౌత్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం లేదు. ఇకపోతే కాంగ్రెస్ ముక్త భారత్ పిలుపునిచ్చిన మోడీ కూడా కాంగ్రెస్‌ను ఏమీ చేయలేక పోయారు. ఆయా రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలను కూడా బిజెపి ఏమీ చేయలేకపోతున్నది. దేశంలో ప్రజల ఆదరణ ఉన్నంత వరకు ఏ పార్టీ అయినా ఉంటుంది. బెంగాల్‌ను తీసుకుంటే ప్రాంతీయ పార్టీగా తృణమూల్ విఫలం అయ్యింది. ఒక ఆడబిడ్డ చేతిలో దేశ భద్రతకు భంగం ఏర్పడింది. తృణమూల్ కాంగ్రెస్ ఎన్నికల్లో ఓడిపోయిన కొద్దిరోజులకే చిన్నాభిన్నం అవుతోంది. ఇది స్వయంకృతంగా చూడాలి. అంతమాత్రాన కాంగ్రెస్‌లో విలీనం అయితే, భ్రష్టత్వం కాంగ్రెస్‌కు కూడా అంటుకుంటుంది. ఇకపోతే ఇండియా కూటమిలో ఉన్న పార్టీలు బలమైన వాణిని వినిపించడం లేదు. అందుకే ఎన్‌డిఎ వైఫల్యాలపై గట్టిగా పోరాడ లేకపోతున్నాయి. అధికారమే లక్ష్యంగా అన్ని పార్టీలు రాజకీయాలు నడుపుతున్నాయి తప్ప ప్రజల కోణంలో ఆలోచన చేయడం లేదు. దళితుల గురించి అన్ని పార్టీలు గొప్పలు చెబుతున్నా ఇప్పటివరకు ఏ రాష్ట్రంలోనూ పూర్తికాలం ముఖ్యమంత్రి అయిన దాఖలాలు లేవు. బెంగాల్లో గతంలో కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీ పరిపాలించినా అవకాశం దళితులకు దక్కలేదు. తమిళనాడులో డీఎంకే అధికారం కోల్పోయినప్పటికీ మరో ప్రాంతీయ పార్టీ అధికారం చేపట్టింది. కేరళలో అధికారం కోల్పోయాక ఇప్పుడు దేశంలో కమ్యూనిస్టు పార్టీలు క్రమంగా కనుమరుగయ్యే స్థితి కనబడు తున్నది. బిహార్‌లో ఆర్జేడీది అదే పరిస్థితి. ఒడిశాలో కూడా నవీన్ పట్నాయక్ బిజూ జనతాదళ్ అదే బాటలో ఉంది. ప్రాంతీయ పార్టీలు ప్రజల్లో బలంగా లేకపోవడం స్వార్థ చింతనతో పాలన చేయడం, ప్రజల ఆకాంక్షలను పట్టించుకోక పోవడం వంటి కారణాలతో కనుమరుగు అవుతున్నాయి. ఉమ్మడి ఎపిలో, ఇప్పుడు విభజిత ఎపిలోతెలుగుదేశం పార్టీ ఇంకా గట్టిగా నిలబడి ఉందంటే అందుకు ప్రజల మద్దతు కారణమని చెప్పాలి. వైఎస్ జగన్ ప్రాంతీయ పార్టీని ప్రజలు నమ్మి ఓటేస్తే ఆయన దానిని నిలబెట్టుకోలేక పోయారు. టిడిపి, ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ కూడా ఫక్తు కుటుంబ పార్టీలుగా మారాయి. అలాగే తెలంగాణలో బిఆర్ఎస్ కూడా కేవలం కుటుంబ పార్టీగా మారింది. ఇలాంటి పార్టీలను ప్రజలు దీర్ఘకాలం నమ్మరని గుర్తించాలి. ఈ స్థితిలో ప్రాంతీయపార్టీలు మారాలి. సమాజంలో అన్నివర్గాల ప్రజలను కలుపుకుని పోవాలి. ప్రజల ఎజెండాను తమ లక్ష్యంగా చేసుకుని ముందుకు సాగాలి. ప్రాంతీయ పార్టీలకు జాతీయ దృక్పథం ఉండాలి. ఆయా రాష్ట్రాల్లో పాలనలో భిన్నత్వం కనిపించాలి. అభివృద్ధిని ఆలంబనగా చేసుకుని ముందుకు సగాలి. లేకుంటే ఆయా పార్టీలను ప్రజలు విసిరి అవత పారేస్తారు. బెంగాల్లో అదే జరిగింది. దేశంలోని ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్, బిజెపిలకు భిన్నంగా పాలన సాగించాలి. ఆయా రాష్ట్రాలను అభివృద్ధిలో ముందు వరసలో నిలబెట్టాలి. జాతీయ పార్టీలకన్నా ప్రాంతీయ పార్టీలే నయమని నిరూపించాలి. ఈ ప్రయత్నంలో తెలుగుదేశం వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ పాలనలో తనదైన ముద్ర వేశారు. దళితులు,గిరిజనలు, బిసిలను రాజకీయంగా ఎంచుకుని వారిని ముందుకు నడిపించారు. ఓ రకంగా ఆయన విప్లవం సాధించారనే చెప్పాలి. అలాగే ఓటు బ్యాంక్ రాజకీయాలకు పోకుండా అభివృద్ధి రాజకీయాలను చేస్తే ప్రజలు తప్పకుండా ప్రాంతీచయ పార్టీలను ఆదరిస్తూనే ఉంటారు. ఎందుకంటే కాంగ్రెస్, బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఆయా ముఖ్యమంత్రులకు స్వేచ్ఛ ఉండదు. జాతీయ పార్టీ కనుక ఢిల్లీ ఆదేశాలను పాటించాల్సి ఉంటుంది. ఈ విషయంలో కాంగ్రెస్ ముందున్నది. చీమచిటుక్కుమన్నా కాంగ్రెస్ ముఖ్యమంత్రులు ఢిల్లీలో కాంగ్రెస్ పెద్దలకు చెప్పాల్సిందే. స్వతంత్ర నిర్ణయాలకు అక్కడ ఆస్కారం ఉండదు. ప్రాంతీయ పార్టీలు జాతీయ ప్రత్యామ్నాయంగా మారితేనే కాంగ్రెస్ , బిజెపిలకు కొంత చెక్ పడుతుంది.

# ఇరాన్‌తో కుదిరిన శాంతి ఒప్పందం

- ట్రూత్ సోషల్ మీడియాలో ప్రకటించిన ట్రంప్
- ఒప్పందాన్ని స్వాగతించిన ప్రపంచ దేశాలు



**వాషింగ్టన్, జూన్ 15:** పశ్చిమాసియా ఉద్రిక్తతలకు తెర పడింది. అమెరికా-ఇరాన్ మధ్య చారిత్రక శాంతి ఒప్పందం కుదిరింది. ఈ వారం చివర్లో దీనిపై సంతకాలు జరగనున్నాయి. 3నెలలకు పైగా సాగిన యుద్ధం ముగిసిపోవడంతో భారత్ సహా ప్రపంచదేశాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ ఒప్పందాన్ని స్వాగతిస్తూ.. పశ్చిమాసియాలో సుస్థిర శాంతి నెలకొనాలని ఆకాంక్షించాయి. నెలల తరబడి ఉత్కంఠ రేపిన పశ్చిమాసియా ఉద్రిక్తతలకు తెరదించుతూ అమెరికా, ఇరాన్ దేశాల మధ్య కుదిరిన చరిత్రాత్మక శాంతి ఒప్పందాన్ని ప్రపంచ దేశాలు ఏకగ్రీవంగా స్వాగతించాయి. ప్రాంతీయ స్థిరత్వాన్ని పునరుద్ధరించడానికి, వ్యూహాత్మక హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి, అంతర్జాతీయ ఆర్థిక రంగానికి ఊరటనిచ్చేందుకు ఈ ఒప్పందం ఒక అద్భుతమైన దౌత్యపరమైన మలుపు అని ప్రపంచ దేశాల నేతలు అభివర్ణించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన ఈ చారిత్రాత్మక ఒప్పందానికి పాకిస్థాన్ ప్రధానంగా మధ్యవర్తిత్వం వహించగా.. ఖతార్, టర్కీ, యునైటెడ్ కింగ్‌డమ్, జర్మనీ, ఫ్రాన్స్ దేశాలు దీనిపై హర్షం వ్యక్తంచేశాయి. ఈ ఒప్పందం పూర్తయినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' వేదికగా అధికారికంగా ప్రకటించారు. 'ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్‌తో ఒప్పందం ఇప్పుడు పూర్తయింది. అందరికీ అభినందనలు! ప్రపంచ నౌకలారా, మీ ఇంజన్లు స్టార్ట్ చేయండి. ఆయిల్ ప్రవహించనివ్వండి!' అని ట్రంప్ ఉత్సాహంగా ట్వీట్ చేశారు. అమెరికా, ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందాన్ని స్వాగతిస్తున్నాం. ఈ డీల్‌తో హర్మూజ్ జలసంధిలో ఇకపై నౌకల రవాణా నిరాటంకంగా, స్వేచ్ఛగా జరుగుతుందని ఆశిస్తున్నాం. శాంతి, ప్రాంతీయ స్థిరత్వం కోసం చేపట్టే అన్ని చర్యలకు భారత్ ఎల్లప్పుడూ మద్దతిస్తుంది. ఈ పరిణామాలను స్ఫూర్తిగా తీసుకుని ఉక్రెయిన్-రష్యా కూడా శాంతి ప్రయత్నాలు చేయాలని ఆకాంక్షిస్తున్నాం అని మంత్రిత్వ శాఖల అంతర్గత సమావేశంలో భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జయస్వాల్ వెల్లడించారు. అమెరికా-ఇరాన్ మధ్య దౌత్యపరంగా చారిత్రక డీల్ జరగడం అభినందనీయం. ఈ పరిణామాలు ప్రపంచ ఆర్థికవ్యవస్థ పునరుజ్జీవనానికి మార్గం సుగమం చేశాయి. పశ్చిమాసియా మరింత సురక్షితంగా ఉంటుంది. ఈ ఒప్పందాన్ని కృతనిశ్చయంతో అమలుచేయడం అత్యావశ్యకం అని జర్మనీ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్ అభిప్రాయపడ్డారు. ఇరాన్-అమెరికా డీల్ శుభపరిణామం. ఈ ఒప్పందాన్ని వీలైనంత వేగంగా అమల్లోకి తీసుకురావాలి. హర్మూజ్ జలసంధిని త్వరగా, భేషరతుగా తెరవాలి. ఎలాంటి ఆంక్షలు, టోల్స్ లేకుండా నౌకల రవాణాను పునరుద్ధరించాలి. అప్పుడే ప్రాంతీయ స్థిరత్వం సాధించగలం. ఇరాన్ అణు, బాలిస్టిక్ క్షిపణులకు సంబంధించిన ఆందోళనలను కూడా ఈ డీల్ పరిష్కరించాలని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ అన్నారు. ఇరాన్-అమెరికా ఒప్పందాన్ని స్వాగతిస్తున్నాం. అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్‌తో పాటు డీల్ కోసం మధ్యవర్తిత్వం చేసిన దేశాలకు అభినందనలు. ఇప్పుడు అందరి దృష్టి ఈ ఒప్పందం అమలుపైనే ఉంది. హర్మూజ్‌ను శాశ్వతంగా తెరవడంతో పాటు నౌకల భద్రతకు సంబంధించిన సాంకేతిక అంశాల్లో మద్దతిచ్చేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. సుస్థిర శాంతికే మా ప్రథమ ప్రాధాన్యం. ఇరాన్ వద్ద అణ్వాయుధాలు ఉండొద్దన్న మా వైఖరి ఇప్పటికీ స్థిరంగా ఉందని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తెలిపారు. ఈ ఒప్పందాన్ని యావత్ ప్రపంచం కోరుకుంది. ఈ పరిణామాలు పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వానికి మార్గం సుగమం చేస్తాయని ఆశిస్తున్నా. మరికొన్ని రోజుల్లో ఈ ఒప్పందంపై సంతకాలు జరగనున్న వేళ.. ప్రస్తుతానికి ఇరుపక్షాలు రెచ్చగొట్టే చర్యలకు దూరంగా ఉండాలని కోరుతున్నా. దీనికి మధ్యవర్తిత్వం వహించిన దేశాలకు అభినందనలు. అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగా దౌత్య పరిష్కారాలకు మేం నిరంతరం మద్దతు ఇస్తాం తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్ అభిప్రాయపడ్డారు.

# కేరళలో నిఫా వైరస్ కలకలం

- కోజికోడ్ జిల్లాలో వ్యక్తికి నిఫా నిర్ధారణ
- మెడికల్ కాలేజీ ఐసియూలో చికిత్స
- వైద్యశాఖను అప్రమత్తం చేసిన ప్రభుత్వం
- కేరళలో వైరస్ భయంతో అప్రమత్తం అయిన తమిళనాడు




**తిరువనంతపురం, జూన్ 15:** దక్షిణ భారత రాష్ట్రాల్లో మరోసారి నిఫా వైరస్ భయం నెలకొంది. కేరళలోని కోజికోడ్ జిల్లాలో ఒక వ్యక్తికి నిఫా వైరస్ సోకినట్లు నిర్ధారణ కావడంతో రాష్ట్ర యంత్రాంగం అత్యవసర చర్యలు చేపట్టింది. కోజికోడ్‌లోని రమణట్టుకర మున్సిపాలిటీ పరిధికి చెందిన 43 ఏళ్ల వ్యక్తి ప్రస్తుతం కోజికోడ్ మెడికల్ కాలేజ్ ఆసుపత్రిలోని ఐసీయూలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడు. పూణెలోని జాతీయ వైరాలజీ సంస్థ నుంచి వైరస్ నిర్ధారణ నివేదిక అందిన వెంటనే కేరళ ప్రభుత్వం వైద్య, ఆరోగ్య శాఖలను అప్రమత్తం చేసింది. వైద్య నిపుణుల సూచనల మేరకు బాధితుడికి మోనోక్లోనల్ యాంటీబాడీ చికిత్సను కూడా ప్రారంభించారు. బాధితుడితో ఇటీవల సన్నిహితంగా మెలిగిన వారిని గుర్తించేందుకు అధికారులు విస్తృత స్థాయిలో కాంటాక్ట్ ట్రేసింగ్ నిర్వహించారు. మొత్తం 87 మందిని పర్యవేక్షణ జాబితాలో చేర్చారు. వీరిలో 58 మంది ఆరోగ్య సిబ్బంది, 14 మంది కుటుంబ సభ్యులు, ఐదుగురు స్నేహితులు ఉన్నారు. అధిక ప్రమాదంలో ఉన్న వ్యక్తులను ముందస్తు జాగ్రత్తగా క్వారంటైన్‌లో ఉంచారు. అయితే, ప్రస్తుతం పర్యవేక్షణలో ఉన్న ఎవరికీ వైరస్ లక్షణాలు కనిపించలేదని, ఇప్పటివరకు సేకరించిన నమూనాల పరీక్ష ఫలితాలు నెగెటివ్‌గా వచ్చాయని కేరళ ఆరోగ్య శాఖ వెల్లడించింది. వైరస్ సమాజంలో విస్తరించిన సూచనలు లేవని, అందువల్ల ప్రస్తుతం కంటైన్‌మెంట్ జోన్లు ప్రకటించే అవసరం లేదని అధికారులు తెలిపారు. పరిస్థితిని సమీక్షించేందుకు జాతీయ వ్యాధి నియంత్రణ కేంద్రం నిపుణుల బృందం కూడా కోజికోడ్ కు చేరుకుంది. కేరళలో నిఫా కేసు వెలుగులోకి రావడంతో పొరుగు రాష్ట్రం తమిళనాడు కూడా అప్రమత్తమైంది. కేరళతో సరిహద్దు కలిగిన నీలగిరి, కోయంబత్తూర్, తేని, కన్యాకుమారి, కడలూరు జిల్లాల్లో ఆరోగ్య శాఖలను సిద్ధంగా ఉంచింది. తాళూర్, నాడుగని, నంబియార్‌కున్ను, సోలాడి, పట్టవాయల్ తదితర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద ప్రత్యేక వైద్య బృందాలను మోహరించి కేరళ నుంచి వచ్చే ప్రయాణికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. అనుమానాస్పద లక్షణాలు ఉన్నవారిని వైద్య శిబిరాలకు తరలించి ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచుతున్నారు. కేరళ నుంచి తమిళనాడులోకి వైరస్ వ్యాపించకుండా నిరోధించడానికి సరిహద్దు జిల్లాల్లో హై అలర్ట్ ప్రకటించారు. కేరళ, కర్ణాటక రాష్ట్రాలతో సరిహద్దులను పంచుకునే ప్రాంతాలతో పాటు పర్యాటక ప్రాంతాలైన నీలగిరి (ఊటీ), కోయంబత్తూరు జిల్లాలపై ఆరోగ్య శాఖ ప్రత్యేక నిఘా ఉంచింది. తమిళనాడు పబ్లిక్ హెల్త్ డైరెక్టరేట్ ఆదేశాల ప్రకారం.. కేరళ సరిహద్దుల్లోని వాలామార్, ఉడుమలైపేట, నాడుగాని, తాళూర్, చోలాడి, పాట్టవయల్ సహా 13 కీలక అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద ఆరోగ్య శాఖ ప్రత్యేక బృందాలను మోహరించింది. చెక్‌పోస్టుల వద్ద 24 గంటలూ పనిచేసేలా ప్రత్యేక మెడికల్ క్యాంప్‌లను ఏర్పాటు చేశారు. కేరళ నుంచి వచ్చే ప్రయాణికులు, పర్యాటకులు, నిత్యం పనుల కోసం సరిహద్దులు దాటే వలస కూలీలకు థర్మల్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జ్వరం, తీవ్రమైన తలనొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, దగ్గు, వాంతులు వంటి నిఫా ప్రాథమిక లక్షణాలు ఉన్నవారిని అధికారులు ప్రత్యేకంగా గుర్తిస్తున్నారు. అనుమానిత లక్షణాలు ఉన్నవారిని వెంటనే ఐసోలేషన్‌కు తరలించేందుకు సరిహద్దుల్లో అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు. నీలగిరి జిల్లా కలెక్టర్, ఆరోగ్య శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రైవేట్ క్లినిక్‌లకు కీలక ఆదేశాలు జారీ చేశారు. జ్వరం లేదా మెదడు వాపు లక్షణాలతో వచ్చే రోగుల వివరాలను, వారి ట్రావెల్ హిస్టరీని నిరంతరం గమనించాలని, ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే స్టేట్ సర్వైలెన్స్ విభాగానికి నివేదించాలని స్పష్టం చేశారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు నిఫా వైరస్ వ్యాప్తికి అనుకూల కాలంగా భావిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. గబ్బిలాలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలకు దూరంగా ఉండాలి. గబ్బిలాలు లేదా పక్షులు కొరికిన పండ్లను తినకూడదు. పెంపుడు జంతువులను తాకిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. తీవ్రమైన జ్వరం, తలనొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం పొందాలి. ప్రజలు పుకార్లను నమ్మకుండా అధికారిక సమాచారం ఆధారంగా మాత్రమే వ్యవహరించాలని అధికారులు సూచిస్తున్నారు.

# సీజేపీ సభలో అనూహ్య ఘటన

**అభిజిత్ దీప్కేపై దాడి..**

**చెంపపై కొట్టిన దుండగులు**

**దుండగులను చితక్కొట్టిన కార్యకర్తలు**



**జైపూర్, జూన్ 15:** నీట్, సీబీఎస్ఈ పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా రాజస్థాన్ జైపూర్‌లో కాక్రోచ్ జనతా పార్టీ తలపెట్టిన ధర్నాలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కాక్రోచ్ జనతా పార్టీ ఫౌండర్ అభిజిత్ దీప్కేపై దాడి జరిగింది. గుర్తు తెలియని దుండగులు అతడిని చెంపపై కొట్టారు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన సీజేపీ కార్యకర్తలు దుండగులపై ఎదురు దాడి చేశారు. తనపై దాడి చేసిన వ్యక్తిని కొట్టొద్దని దీప్కే కోరినప్పటికీ సీజేపీ కార్యకర్తలు వెనక్కి తగ్గలేదు. దుండగులను చితకబాదారు. ఈ ఘటనతో ధర్నాలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు ఇరువర్గాలను అదుపులోకి తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా అభిజిత్‌ను అక్కడి నుంచి తరలించారు. సీజేపీ చీఫ్‌పై దాడి జరిగిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అభిజిత్ దీప్కేపై దాడిని నెటిజన్లు తీవ్రంగా ఖండిస్తున్నారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తోన్న వారిపై భౌతిక దాడులు చేయడమేంటని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అభిజిత్ పై దాడి చేసిన వ్యక్తులు ఎవరనే విషయం తెలియాల్సి ఉంది. నీట్, సీబీఎస్ఈ, సీయూఈటీ, ఎస్ఎస్సీ వంటి ప్రధాన పరీక్షలలో జరిగిన అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీజేపీ దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగానే సోమవారం రాజస్థాన్ రాజధాని జైపూర్‌లో సీజేపీ ధర్నా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే హాజరై ప్రసంగించారు. అనుహ్యాంగా ఈ ధర్నాలో ఆయనపై గుర్తు తెలియని దుండగులు దాడి చేశారు

# అమెరికా మిస్సోరిలో కుప్పకూలిన విమానం

## ప్రమాదంలో 12 మంది దుర్మరణం

**వాషింగ్టన్,జూన్15:** అమెరికాలోని మిస్సోరీ రాష్ట్రంలో ఓ విమానం కుప్పకూలింది. ఈ ఘటనలో అందులో ప్రయాణిస్తున్న 12 మంది చనిపోయారు. స్కైడైవింగ్ చేసే వారిని తీసుకెళ్తుండగా బట్లర్ మెమోరియల్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో ఈదుర్ఘటన జరిగింది. ప్లేన్ టేకాఫ్ అయిన తర్వాత రన్‌వేకు సుమారు 300 గజాల దూరంలో క్రాష్ అయింది. చనిపోయిన వారిలో 11 మంది స్కైడైవర్లు, ఒక పైలట్ ఉన్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.






## పసిడి ధరలకు రెక్కలు

హైదరాబాద్, జూన్ 15: అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరి పశ్చిమాసియా ప్రాంతంలో ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టినప్పటికీ, దేశీయ మార్కెట్‌లో బంగారం ధరలు ఒక్కసారిగా భారీగా పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావంతో పాటు పెట్టుబడిదారుల కొనుగోళ్లు పెరగడంతో పసిడి ధరలు ఎగబాకినట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. గుడ్ రిటర్న్స్ గణాంకాల ప్రకారం, నేడు దేశవ్యాప్తంగా 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర గత ముగింపుతో పోలిస్తే రూ.2,450 పెరిగి సగటున రూ.1,51,530కు చేరుకుంది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.2,250 పెరిగి రూ.1,38,900గా నమోదైంది. 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర కూడా రూ.1,840 పెరిగి రూ.1,13,650కు చేరింది. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో ఉదయం 10 గంటల సమయానికి 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,51,530గా ఉండగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,38,900కు చేరింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని ఇతర ప్రాంతాల్లో కూడా దాదాపు ఇదే స్థాయిలో ధరలు నమోదయ్యాయి. దేశంలోని ప్రధాన నగరాల్లో బంగారం ధరలు కూడా భారీగా పెరిగాయి. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,53,490గా నమోదవగా, న్యూఢిల్లీలో రూ.1,51,680కు చేరింది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,51,530గా ఉంది. లక్నోలో రూ.1,51,680, వడోదరా మరియు భోపాల్‌లో రూ.1,51,580గా నమోదైంది. 22 క్యారెట్ల బంగారం ధర చెన్నైలో రూ.1,40,700కు చేరగా, న్యూఢిల్లీ మరియు లక్నోలో రూ.1,39,050గా ఉంది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు, నాగ్‌పూర్ నగరాల్లో రూ.1,38,900గా నమోదైంది. మరోవైపు 18 క్యారెట్ల బంగారం ధర చెన్నైలో రూ.1,18,000గా ఉండగా, న్యూఢిల్లీ, లక్నోలో రూ.1,13,800, ముంబై, కోల్‌కతా, బెంగళూరులో రూ.1,13,650గా నమోదైంది. బంగారం ధరల్లో ఒకేరోజు భారీ పెరుగుదల నమోదవడంతో కొనుగోలుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రానున్న రోజుల్లో అంతర్జాతీయ మార్కెట్ ధోరణులను బట్టి పసిడి ధరల్లో మరింత హెచ్చుతగ్గులు ఉండే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## రూపాయి దూకుడు

**ముంబై, జూన్ 15 :** అంతర్జాతీయ మార్కెట్లలో చోటుచేసుకున్న కీలక పరిణామాల ప్రభావంతో భారత రూపాయి నేడు అమెరికా డాలర్‌తో పోలిస్తే గణనీయంగా బలపడింది. అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదిరిందన్న వార్తలతో ముడి చమురు ధరలు భారీగా పడిపోవడంతో రూపాయి ఒకేరోజు 58 పైసలు లాభపడింది. ఇంటర్‌బ్యాంక్ విదేశీ మారకద్రవ్య మార్కెట్‌లో రూపాయి 94.70 వద్ద ట్రేడింగ్ ప్రారంభించి, అనంతరం మరింత బలపడి 94.60 స్థాయికి చేరుకుంది. గత ట్రేడింగ్ సెషన్‌లో రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే 95.18 వద్ద ముగిసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన శాంతి ఒప్పందం ప్రపంచ ఆర్థిక మార్కెట్లలో సానుకూల సంకేతాలను పంపింది. ఇరాన్‌తో ఒప్పందం పూర్తయిందని, వ్యూహాత్మక ప్రాధాన్యం కలిగిన హర్మూజ్ జలసంధి తిరిగి తెరుచుకునే అవకాశముందని ఆయన వెల్లడించారు. ప్రపంచ ముడి చమురు రవాణాలో కీలకమైన ఈ జలమార్గం మళ్లీ అందుబాటులోకి రానుండటంతో సరఫరాపై నెలకొన్న ఆందోళనలు తగ్గాయి. ఈ పరిణామాల ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా క్షీణించాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర దాదాపు ఐదు శాతం పడిపోయి 83 డాలర్లకు చేరుకోగా, అమెరికా ముడి చమురు ధర కూడా ఐదు శాతానికి పైగా తగ్గి 80 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ముడి చమురు ధరల తగ్గుదల భారత్‌కు అనుకూలంగా మారిందని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు దిగుమతిదారులలో ఒకటైన భారత్‌కు దిగుమతి వ్యయం తగ్గే అవకాశం ఉండటంతో విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి తగ్గనుంది. దీంతో పాటు దేశ కరెంట్ అకౌంట్ లోటు కూడా నియంత్రణలో ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా అమెరికా డాలర్ బలహీనపడటం, అమెరికా ట్రెజరీ బాండ్లపై లాభదాయకత తగ్గడం, ఆసియా మార్కెట్లలో సానుకూల వాతావరణం నెలకొనడం వంటి అంశాలు కూడా రూపాయి బలోపేతానికి దోహదపడ్డాయి. అంతర్జాతీయ పరిణామాలు ఇదే విధంగా కొనసాగితే రానున్న రోజుల్లో రూపాయి మరింత పుంజుకునే అవకాశం ఉందని ఆర్థిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.



# వృద్ధిని తేలిగ్గా తీసుకోవద్దు: నిర్మలా

**న్యూఢిల్లీ, జూన్ 15:** భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం సంతృప్తికరంగా రాణిస్తున్నప్పటికీ, ఈ వృద్ధిని తేలిగ్గా తీసుకోవద్దని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ హెచ్చరించారు. దీర్ఘకాలికంగా అభివృద్ధి కొనసాగాలంటే నిరంతర ఆవిష్కరణలు, సంస్కరణలు, వ్యవస్థల బలోపేతం అత్యంత అవసరమని ఆమె స్పష్టం చేశారు. 'మైండ్‌మైన్ సమ్మిట్-2026'లో పాల్గొన్న నిర్మలా సీతారామన్ దేశ ఆర్థిక పరిస్థితులపై మాట్లాడారు. భారతదేశం ఆర్థికంగా మంచి పురోగతి సాధిస్తున్నప్పటికీ, పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇంకా ఎక్కడ మెరుగుదలకు అవకాశం ఉందో గుర్తించి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. కేవలం ఆర్థిక వృద్ధి రేటు పెరగడం మాత్రమే సరిపోదని, స్థిరమైన మరియు సమ్మిళిత అభివృద్ధి కోసం బలమైన సంస్థలు, సమర్థవంతమైన విధానాలు, పటిష్ఠమైన మద్దతు వ్యవస్థలు అవసరమని పేర్కొన్నారు. భారతదేశం వంటి విస్తృతమైన, సంక్లిష్ట ఆర్థిక వ్యవస్థలో వృద్ధిని కొనసాగించాలంటే సామర్థ్యాలను పెంపొందించడం, ఉత్పాదకతను మెరుగుపరచడం, అభివృద్ధి ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరేలా చూడడం అత్యవసరమన్నారు. పురోగతి సహజంగా వస్తుందని భావించడం సరైంది కాదని, వృద్ధి వేగాన్ని నిలబెట్టుకోవడానికి నిరంతర కృషి, కొత్త ఆలోచనలు, సంస్కరణలు తప్పనిసరని ఆమె అభిప్రాయపడ్డారు. వివిధ రంగాలు ప్రస్తుతం మంచి పనితీరు కనబరుస్తున్నప్పటికీ, ముఖ్యంగా మధ్యంతర ఉత్పత్తులు,



సంక్లిష్ట తయారీ రంగాలు, సేవల రంగాలకు ఇంకా విధానపరమైన మద్దతు అవసరమని అంగీకరించారు. దీర్ఘకాలంగా కొనసాగుతున్న సవాళ్లను నిర్మాణాత్మక సంస్కరణలు, మెరుగైన అమలు విధానాలు, కొత్త విధాన నిర్ణయాల ద్వారా అధిగమించే దిశగా విధానకర్తలు నిరంతరం ఆలోచించాలని ఆమె సూచించారు. ఇదే సమయంలో ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంపై కూడా ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్‌నినో కారణంగా రుతుపవనాలు బలహీనపడే అవకాశం ఉందని, అలాంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అవసరమైన సన్నాహాలు చేస్తోందని తెలిపారు.

# ఆన్‌లైన్ మోసాలతో ఏటా వేల కోట్ల నష్టం

**న్యూఢిల్లీ, జూన్ 15:** దేశంలో ఇ-వాణిజ్య రంగం వేగంగా విస్తరిస్తున్నప్పటికీ, ఆన్‌లైన్ వేదికలు అనుసరిస్తున్న మోసపూరిత డిజిటల్ విధానాల కారణంగా వినియోగదారులు భారీగా ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్నట్లు తాజా అధ్యయనం వెల్లడించింది. 'డేటమ్ ఇంటెలిజెన్స్' విడుదల చేసిన నివేదిక ప్రకారం, ఈ తరహా తప్పుడు విధానాల వల్ల భారతీయ వినియోగదారులు ఏటా రూ.25 వేల కోట్ల నుంచి రూ.28 వేల కోట్ల వరకు నష్టపోతున్నారు. దేశంలోని సుమారు 30.4 కోట్ల మంది డిజిటల్ వినియోగదారుల్లో దాదాపు 88 శాతం మంది దాచిపెట్టిన రుసుములు, బలవంతపు కొనుగోళ్లు, చివరి దశలో అదనపు చార్జీలు జోడించడం వంటి పద్ధతుల కారణంగా ప్రతి నెలా సగటున రూ.78 నుంచి రూ.87 వరకు నష్టపోతున్నట్లు నివేదిక పేర్కొంది. వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంస్థ ఈ ఏడాది జనవరిలో పలు సంస్థలపై రూ.44 లక్షల జరిమానాలు విధించినప్పటికీ, 73 శాతం ఆన్‌లైన్ వేదికలు ఇప్పటికీ వినియోగదారులను ఒత్తిడికి గురిచేసే వ్యాపార విధానాలను కొనసాగిస్తున్నాయని అధ్యయనం వెల్లడించింది. అలాగే 69 శాతం సంస్థలు కొనుగోలు చివరి దశలో అదనపు




చార్జీలు జోడించే విధానాన్ని అనుసరిస్తున్నట్లు తేలింది. వినియోగదారుల విశ్వాసం విషయంలో ప్రముఖ ఆన్‌లైన్ వాణిజ్య సంస్థ అమెజాన్ అగ్రస్థానంలో నిలిచింది. సర్వేలో పాల్గొన్న వారిలో సగం మంది వినియోగదారులు అమెజాన్‌ను అత్యంత విశ్వసనీయ వేదికగా పేర్కొన్నారు. మరోవైపు ఫ్లిప్‌కార్ట్, మింత్రా, నైకా వంటి సంస్థలపై వినియోగదారుల్లో ప్రతికూల అభిప్రాయం ఎక్కువగా ఉన్నట్లు నివేదిక వెల్లడించింది. ప్రత్యేకంగా ఫ్లిప్‌కార్ట్‌పై 41 శాతం మంది వినియోగదారులు విశ్వాసం లేదని వెల్లడించారు. కొనుగోలు ప్రక్రియలో అదనపు రుసుములు వసూలు చేయడం ఇందుకు ప్రధాన కారణంగా పేర్కొన్నారు. ప్రయాణ సేవల విభాగంలో మేక్‌మైట్రిప్ అత్యంత విశ్వసనీయ వేదికగా నిలవగా, క్లియర్‌ట్రిప్‌పై ఎక్కువ ఫిర్యాదులు నమోదైనట్లు అధ్యయనం తెలిపింది. త్వరిత సరఫరా సేవల రంగంలో బిగ్‌బాస్కెట్ అత్యంత బలహీన పనితీరు నమోదు చేసిన సంస్థగా గుర్తించబడింది. ఈ మోసపూరిత విధానాల కారణంగా వినియోగదారులు ప్రత్యామ్నాయ వేదికలకు మారిపోతుండటంతో సుమారు రూ.55 వేల కోట్ల విలువైన వ్యాపారం ప్రమాదంలో పడే అవకాశముందని నివేదిక హెచ్చరించింది. వినియోగదారుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రస్తుత నిబంధనలను మరింత కఠినతరం చేయడంతో పాటు డిజిటల్ వాణిజ్య రంగానికి అనుగుణంగా చట్టాలను ఆధునీకరించాల్సిన అవసరం ఉందని నిపుణులు సూచిస్తున్నారు.

# ఏఐ లాభాలు కొందరికే పరిమితం కాకూడదు: సత్య నాదెళ్ల



**న్యూఢిల్లీ, జూన్ 15 :** కృత్రిమ మేధస్సు సాంకేతికత ప్రపంచ వ్యాపార వ్యవస్థలను వేగంగా మార్చేస్తున్నప్పటికీ, గత ఆర్థిక, పారిశ్రామిక విప్లవాల సమయంలో జరిగిన తప్పిదాలు మళ్లీ పునరావృతం కాకుండా జాగ్రత్త పడాల్సిన అవసరం ఉందని ప్రముఖ సాంకేతిక దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ ప్రధాన కార్యనిర్వాహక అధికారి సత్య నాదెళ్ల హెచ్చరించారు. సామాజిక మాధ్యమ వేదికలో పంచుకున్న తన విశ్లేషణలో ఆయన కృత్రిమ మేధస్సు భవిష్యత్తు, ఆర్థిక సమానత్వం, పరిశ్రమల అభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. కృత్రిమ మేధస్సు ద్వారా వచ్చే లాభాలు, అవకాశాలు కేవలం కొద్ది పెద్ద సాంకేతిక సంస్థలకే పరిమితమైతే, అనేక పరిశ్రమలు తమ విలువను, నైపుణ్యాన్ని, పోటీతత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగాల భద్రత, వ్యాపారాల భవిష్యత్తుపై ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో నాదెళ్ల చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. కృత్రిమ మేధస్సును కేవలం ఉత్పాదకత పెంచే సాధనంగా మాత్రమే చూడడం సరైన దృక్పథం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ప్రపంచం గత సాంకేతిక విప్లవాల కంటే భిన్నమైన దశలోకి ప్రవేశించిందని, భవిష్యత్తులో మనుషులు మరియు కృత్రిమ మేధస్సు వ్యవస్థలు పరస్పరం ఒకరి నుంచి ఒకరు నేర్చుకుంటూ అభివృద్ధి చెందుతాయని ఆయన తెలిపారు. ఈ ప్రక్రియను ఆయన "జ్ఞాన పరస్పర చక్రం"గా అభివర్ణించారు. భవిష్యత్తులో సంస్థలు రెండు రకాల మూలధనాలను నిర్మించుకోవాల్సి ఉంటుందని నాదెళ్ల వివరించారు. ఉద్యోగుల అనుభవం, సృజనాత్మకత, నిర్ణయ సామర్థ్యం, సంబంధాలతో కూడిన మానవ మూలధనం ఒక వైపు ఉండగా, సంస్థలు స్వయంగా అభివృద్ధి చేసుకునే కృత్రిమ మేధస్సు సామర్థ్యాలతో కూడిన సాంకేతిక మూలధనం మ-రోవైపు ఉంటుందని చెప్పారు. కృత్రిమ మేధస్సును మానవ ( శ ్ వ ం క ్ ం ప్రత్యామ్నాయంగా చూడటం సరైన విధానం కాదని, ఎంత అధునాతన



సాంకేతికత వచ్చినా మానవ మేధస్సు, సృజనాత్మకత, నిర్ణయ సామర్థ్యానికే అత్యధిక ప్రాధాన్యత ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. సాంకేతికత మరియు మానవ నైపుణ్యం కలిసి పనిచేసినప్పుడే సమాజానికి, ఆర్థిక వ్యవస్థకు స్థిరమైన ప్రయోజనాలు లభిస్తాయని నాదెళ్ల పేర్కొన్నారు.

# వేదాంత డీమర్జర్ పూర్తి..

## ఐదు కంపెనీల షేర్ల ట్రేడింగ్ ప్రారంభం

**ముంబై, జూన్ 15 :** గనులు, లోహాలు, ఇంధన రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రముఖ వేదాంత గ్రూప్ డీమర్జర్ ప్రక్రియ విజయవంతంగా పూర్తైంది. విభజన అనంతరం ఏర్పడిన నాలుగు కొత్త కంపెనీల షేర్లు సోమవారం బీఎస్ఈ, ఎన్ఎస్ఈ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ట్రేడింగ్ ప్రారంభించాయి. దీంతో వేదాంత గ్రూప్‌కు చెందిన మొత్తం ఐదు కంపెనీలు స్టాక్ మార్కెట్‌లో ట్రేడింగ్‌కు అందుబాటులోకి వచ్చాయి. వేదాంతా లిమిటెడ్‌తో పాటు వేదాంతా అల్యూమినియం మెటల్స్, వేదాంతా ఆయిల్ అండ్ గ్యాస్, వేదాంతా పవర్, వేదాంతా ఐరన్ అండ్ స్టీల్ కంపెనీల షేర్లు మార్కెట్లో అరంగేట్రం చేశాయి. వీటిలో వేదాంతా అల్యూమినియం మెటల్స్ షేర్ బీఎస్ఈలో రూ.527 వద్ద ట్రేడింగ్ ప్రారంభించి, రోజులో రూ.538 గరిష్ఠ స్థాయిని తాకింది. దీంతో ఆ సంస్థ మార్కెట్ విలువ సుమారు రూ.1.95 లక్షల కోట్లకు చేరుకుంది. వేదాంతా పవర్ షేర్ రూ.41.30 వద్ద లిస్టయి, సంస్థ మార్కెట్ విలువ రూ.16,736 కోట్లకు చేరింది. వేదాంతా ఆయిల్ అండ్ గ్యాస్ సంస్థ మార్కెట్ విలువ రూ.14,487 కోట్లుగా నమోదవగా, వేదాంతా ఐరన్ అండ్ స్టీల్ సంస్థ మార్కెట్ విలువ రూ.8,231 కోట్లకు చేరింది. డీమర్జర్ పథకం ప్రకారం మే 1ను రికార్డు తేదీగా నిర్ణయించారు. ఆ తేదీ నాటికి వేదాంతా లిమిటెడ్ షేర్లు కలిగి ఉన్న ప్రతి పెట్టుబడిదారుడికి కొత్తగా ఏర్పడిన నాలుగు కంపెనీల్లో ఒక్కో షేర్ కేటాయించారు. అంటే ఒక వేదాంతా షేర్ కలిగి ఉన్న పెట్టుబడిదారుడికి అదనంగా నాలుగు కొత్త కంపెనీల్లో ఒక్కో షేర్ చొప్పున లభించింది. ఈ డీమర్జర్ ద్వారా వేదాంత గ్రూప్ తన వ్యాపార విభాగాలను స్వతంత్ర సంస్థలుగా మార్చి, పెట్టుబడిదారులకు మరింత విలువ సృష్టించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు




మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. కొత్త కంపెనీలు స్వతంత్రంగా కార్యకలాపాలు నిర్వహించడం ద్వారా భవిష్యత్తులో వృద్ధి అవకాశాలు మరింత పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# కరుప్ప విజయంతో మరింత బిజీగా త్రిష

## రెమ్యునరేషన్ కూడా పెంచినట్లు టాక్

సౌత్ సినీ ఇండస్ట్రీలో రెండు దశాబ్దాలకు పైగా తన స్టార్‌డమ్‌ను నిలబెట్టుకున్న హీరోయిన్ త్రిష మరోసారి వార్తల్లో నిలిచారు. ప్రస్తుతం ఆమె రెమ్యూనరేషన్‌కు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. వరుస విజయాలతో కెరీర్‌లో మళ్లీ బిజీ అయిన త్రిష, కొత్త సినిమాల కోసం తన పారితోషికాన్ని పెంచినట్లు సినీవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. త్రిష కెరీర్‌ను పరిశీలిస్తే ఎన్నో విజయాలతో పాటు కొన్ని పరాజయాలు కూడా ఎదురయ్యాయి. అయితే ప్రతిసారి చిన్న విరామం తర్వాత ఆమె మరింత బలంగా తిరిగి వచ్చి తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. ఇదే కారణంగా ఆమెను సౌత్ ఇండస్ట్రీలో అత్యంత నిలకడైన హీరోయిన్లలో ఒకరిగా భావిస్తారు. ఇటీవల కొన్ని సినిమాలు ఆశించిన స్థాయిలో విజయాలు సాధించకపోయినా, తాజాగా కరుప్పు వంటి భారీ హిట్‌తో త్రిష మార్కెట్ మళ్లీ ఊపందుకుందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఆమె కెరీర్‌లో మరో గోల్డెన్ ఫేజ్ నడుస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ముఖ్యంగా పెద్ద హీరోల సరసన అవకాశాలు రావడం, పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు పెరగడం, ప్రేక్షకుల్లో ఇప్పటికీ మంచి ఆదరణ ఉండటం ఆమె క్రేజ్‌కు ప్రధాన కారణాలుగా చెప్పొచ్చు. యువ హీరోయిన్ల నుంచి గట్టి పోటీ ఉన్నప్పటికీ, తన అనుభవం, నటన, స్క్రీన్ ప్రెజెన్స్‌తో త్రిష ప్రత్యేక స్థానాన్ని కొనసాగిస్తున్నారు. అందుకే నిర్మాతలు ఇప్పటికీ ఆమెను తమ ప్రాజెక్టుల్లో భాగం చేసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారని సమాచారం. ఇటీవల విడుదలైన కరుప్పు చిత్రం విజయంతో త్రిషకు కొత్త అవకాశాలు మరింత పెరిగినట్లు టాక్ వినిపిస్తోంది. ముఖ్యంగా తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి రూపొందే ద్విభాషా చిత్రాల కోసం ఆమెను సంప్రదిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే త్రిష తన రెమ్యూనరేషన్‌ను కూడా పెంచినట్లు వార్తలు వెలువడుతున్నాయి. మరోవైపు త్రిష చేతిలో ఇప్పటికే పలు ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు ఉన్నాయి. తెలుగు, తమిళంతో పాటు ఇతర దక్షిణాది భాషల నుంచి కూడా అవకాశాలు వస్తున్నాయి.

# వెంకటేశ్, కళ్యాణ్ రామ్ కాంబో

## మరో సినిమా ప్లాన్ చేస్తున్న అనిల్ రావిపూడి




టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న దర్శకుడు అనిల్ రావిపూడి మరో భారీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ముఖ్యంగా సంక్రాంతి సీజన్‌లో ఆయన సినిమాలకు ప్రత్యేక క్రేజ్ ఏర్పడింది. 'సంక్రాంతికి వస్తున్నాం', 'మన శంకర వరప్రసాద్ గారు' వంటి వరుస విజయాల తర్వాత అనిల్ రావిపూడి ఇప్పుడు విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్‌లతో కలిసి ఓ క్రేజీ మల్టీస్టారర్ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే వెంకటేష్‌తో 'ఎఫ్2', 'ఎఫ్3' వంటి విజయవంతమైన చిత్రాలు అందించిన అనిల్, కళ్యాణ్ రామ్‌తో తన తొలి చిత్రం 'పటాస్' ద్వారా సూపర్ హిట్ అందుకున్నారు. ఇప్పుడు ఈ ఇద్దరు హీరోలను ఒకే సినిమాలో చూపించబోతుండటంతో ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు ఇప్పటికే పూర్తయ్యాయి. ప్రీ-ప్రొడక్షన్ పనులు కూడా దాదాపు ముగింపు దశకు చేరుకున్నాయని సమాచారం. పూర్తి స్థాయి యాక్షన్, ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ చిత్రాన్ని 2027 సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సినిమా టైటిల్‌కు సంబంధించి ఆసక్తికరమైన ప్రచారం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. పండుగ వాతావరణం, ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్, అనిల్ రావిపూడి స్టైల్ కామెడీకి సరిపోయేలా ఈ చిత్రానికి 'సంక్రాంతి సరుకు' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఈ టైటిల్ మాస్, ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఆకట్టుకునే అవకాశముందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే దీనిపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇదిలా ఉంటే, ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 'సింగ్ గీతం' గోల్డెన్ బ్లాక్‌బస్టర్ ఈవెంట్‌లో అనిల్ రావిపూడి చేసిన వ్యాఖ్యలు కూడా వైరల్‌గా మారాయి. ప్రముఖ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు తెరకెక్కించిన ఈ చిత్ర విజయోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన, నిర్మాత నాగ్ అశ్విన్‌పై ప్రశంసలు కురిపించారు. సాధారణంగా మేము ట్రైలర్లు, ప్రమోషన్లతో సినిమాపై హైప్ క్రియేట్ చేయడానికి చాలా కష్టపడతాం. కానీ నాగ్ అశ్విన్ మాత్రం ట్రైలర్ లేకుండానే సినిమాను విడుదల చేసి విజయం సాధించారు. ఆ ఫార్ములా నాకు బాగా నచ్చింది. ఇకపై నా సినిమాలకు కూడా ట్రైలర్లు కట్ చేయను అంటూ సరదాగా వ్యాఖ్యానించారు.

# సినీ నటికి వేధింపులు

## క్యాస్టింగ్ ఆర్టిస్ట్‌పై కేసు నమోదు




సినిమా అవకాశాల పేరుతో ఓ నటిని వేధించడమే కాకుండా, రావాల్సిన పారితోషికం ఇవ్వకుండా మోసం చేసిన క్యాస్టింగ్ ఆర్టిస్ట్ ప్రసాద్‌పై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. 'ఆకాశంలో ఒక తార' సినిమాలో నటింపజేసినందుకు గానూ సదరు నటికి ఇవ్వాల్సిన రూ.90 వేల పారితోషికం, రూ.38 వేల ప్రయాణ ఖర్చులను ఇవ్వకుండా నిందితుడు కాలయాపన చేశాడు. ఈ క్రమంలోనే గత ఫిబ్రవరిలో బంజారాహిల్స్‌కు పిలిపించి, బకాయిలు ఇవ్వకుండా బెదిరించడమే కాకుండా.. బలవంతంగా కారులో ఎక్కించుకుని మరిన్ని అవకాశాలు ఇస్తానంటూ ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. భయంతో అక్కడి నుంచి వెళ్ళిపోయిన బాధితురాలు జరిగిన విషయాన్ని తల్లికి చెప్పగా, ఆమె నిందితుడిని ఫోన్‌లో నిలదీసింది. అయితే ఆమెను సైతం నిందితుడు దుర్భాషలాడి బెదిరించడంతో, బాధితురాలి ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# వివాహ వార్షికోత్సవం.. పిల్ల చేతులతో పోస్ట్

## ఉపాసన పోస్ట్‌తో అభిమానుల్లో ఆనందం



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్‌కు ప్రస్తుతం డబుల్ సెలబ్రేషన్స్ నడుస్తున్నాయి. ఒకవైపు ఆయన నటించిన 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేస్తుండగా, మరోవైపు జూన్ 14న రామ్ చరణ్-ఉపాసన దంపతులు తమ వివాహ వార్షికోత్సవాన్ని జరుపుకున్నారు. దీంతో మెగా అభిమానుల్లో ఆనందం రెట్టింపైంది.అయితే రామ్ చరణ్, ఉపాసన దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా అభిమానులు సోషల్ మీడియాలో శుభాకాంక్షల వర్షం కురిపించారు. 2012 జూన్ 14న వివాహ బంధంతో ఒక్కటైన ఈ జంట, టాలీవుడ్‌లో



అత్యంత అభిమానించబడే సెలబ్రిటీ కపుల్స్‌లో ఒకరిగా నిలిచింది. ఈ ప్రత్యేక సందర్భంగా ఉపాసన కొణిదెల సోషల్ మీడియాలో చేసిన పోస్ట్ అభిమానులను భావోద్వేగానికి గురి చేసింది. తమ ముగ్గురు పిల్లల చిన్న చేతులను చూపిస్తూ ఓ అందమైన ఫోటోను ఆమె పంచుకున్నారు. కుటుంబ బంధాలను ప్రతిబింబించే ఈ పోస్ట్ క్షణాల్లోనే వైరల్‌గా మారింది. ఇప్పటికే రామ్ చరణ్-ఉపాసన దంపతులకు కుమార్తె క్లింకార ఉన్న సంగతి తెలిసిందే. ఇటీవల వారి కుటుంబంలోకి కవల పిల్లలు కూడా చేరడంతో ఆనందం మరింత పెరిగింది. తాజా ఫోటోలో ముగ్గురు చిన్నారుల చేతులు కనిపించడంతో అభిమానులు మురిసిపోతున్నారు. 'పెద్ది' విజయం, ఇటు వివాహ వార్షికోత్సవం, కుటుంబ ఆనందాలు.. ఇలా అన్ని శుభ పరిణామాలు ఒకేసారి రావడంతో రామ్ చరణ్ కుటుంబంలో ప్రస్తుతం పండుగ వాతావరణం నెలకొంది. ఉపాసన షేర్ చేసిన ఈ ఫోటో సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానుల హృదయాలను గెలుచుకుంటోంది.

# కర్నూలులో నాగబంధం యూనిట్ సందడి

కర్నూలు నగరంలో నాగబంధం చిత్ర బృందం సందడి చేసింది. కర్నూలు కొండారెడ్డి బురుజు వద్ద అనంత పద్మనాభ స్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి ఈ సినిమా ప్రమోషన్స్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హీరో విరాట్ కర్ణ, హీరోయిన్ నభా నటేష్, కర్నూలు ఎంపీ బస్తిపాడు నాగరాజు పాల్గొన్నారు. సినిమా ప్రమోషన్‌ను కర్నూలు నుంచి ప్రారంభించడం సంతోషంగా ఉందని సినీనటులు తెలిపారు. యువతకు పురాణ కథలు, దేవాలయాల గురించి సినిమాలో చూపించామన్నారు. జులై 3వ తేదీన ఈ చిత్రం విడుదలవుతుందని, అందరూ ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా కొండారెడ్డి బురుజు వద్ద హీరోయిన్ డ్యాన్స్‌తో సందడి చేశారు.




PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in